మన
# నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL/25/A4284
www.manananationalistvoice.com epaper.manananationalistvoice.com
ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 185 | 02 మంగళవారం, జూన్ 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-
హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ణ, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం

రిపోర్టర్లు కావలెను
మన నేషనలిస్ట్ వాయిస్ తెలుగు దిన పత్రిక
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న నేషనలిస్ట్ వాయిస్ మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది.
రిపోర్టర్లు కావాలి.
ఇంకెందుకు ఆలస్యం...
9666023180.8096660656 నంబర్లకు

## ఆదిలాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- ఆదివాసీల సొంతింటి కల నెరవేరుస్తున్నాం
- అర్హులైన ఆదివాసీ బిడ్డల కోసం స్పెషల్‌డ్రైవ్
- నూరుశాతం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తాం
- మహా సిఎంకు తెలంగాణ అంటే చిన్నచూపు
- తుమ్మిడిహట్టి గురించి లేఖ రాస్తే స్పందనేదీ
- జిల్లా పర్యటనలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన సిఎం రేవంత్



02



## బాల్కపై ఆస్తుల విధ్వంసం కేసు

### - సెక్షన్ చెల్లదన్న నాంపల్లి కోర్టు

**హైదరాబాద్,జూన్1 నేషనలిస్ట్ వాయిస్**

సింగరేణి కార్యాలయంపై వివాదాస్పద వ్యాఖ్యల కేసులో అరెస్టయిన బాల్క సుమన్ వ్యవహారంలో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. అతడిపై ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం సెక్షన్ వర్తించదని నాంపల్లి కోర్టు స్పష్టం చేసింది.

వివరాలు 2లో

## పేదలకు నేరుగా పెన్షన్ ఇస్తేనే ఆనందం

- పేదరికం లేని సమాజమే తన లక్ష్యం
- తునిలో పెన్షన్లు పంపిణీలో సిఎం చంద్రబాబు



**కాకినాడ,జూన్1 నేషనలిస్ట్ వాయిస్**

:పేదవాడి ఇంటికెళ్లి పెన్షన్ ఇస్తే.. ఆ ఆనందమే వేరని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అందుకే బటన్ నొక్కడానికి ఇష్టపడట్లేదని పేర్కొన్నారు. పేదరికం లేని సమాజం చూడాలనేది తమ ప్రభుత్వ కల అని ఉద్ఘాటించారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో సీఎం సోమవారం పర్యటించారు. తుని నియోజకవర్గం, చామవరంలో పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. పెన్షన్ల ద్వారా 62.34 లక్షల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్నామని స్పష్టం చేశారు.

వివరాలు 2లో

## మద్దతు ధరకు తడిసిన ధాన్యం కొనుగోళ్లు

### ఇప్పటికే 64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

### రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**సూర్యాపేట,జూన్1 నేషనలిస్ట్ వాయిస్**



వరి ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో ఉందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, ధాన్యం కొనుగోళ్ల ప్రగతిని వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా.. రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా ఇప్పటివరకు సుమారు 64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విజయవంతంగా సేకరించామని మంత్రి తెలిపారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని సైతం రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో, ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేసిందని ఆయన స్పష్టం చేశారు. చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.యాసంగిలో మొత్తం భారతదేశం నుంచి కేంద్రానికి అందిన ధాన్యంలో 63 శాతం వాటా ఒక్క తెలంగాణ రాష్ట్రం నుంచే వెళ్లడం మన రైతుల కష్టానికి, ప్రభుత్వ సహకారానికి నిదర్శనమని మంత్రి ఉత్తమ్ కొనియాడారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

### - తెలంగాణ ప్రజలకు కెసిఆర్ శుభాకాంక్షలు

**హైదరాబాద్,జూన్1 నేషనలిస్ట్ వాయిస్**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్న కేసీఆర్ వారికి నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రజల మీద దశాబ్దాల పాటు సాగిన అణచివేతపై పోరాడి, అనేక అవాంతరాలను అధిగమించి, శాంతి యుతమైన పార్లమెంటరీ పంథాలో, ప్రజాస్వామ్య యుతంగా కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని కేసీఆర్ తెలిపారు. ఉమ్మడి పాలనలో తీవ్ర వివక్షకు గురై, దిక్కుతోచని స్థితిలో ఉన్న తెలంగాణను స్వయం పాలనలో ఒక దిక్సూచిలా మార్చుకున్నామని, 'పరి పాలన చేతగాదు' అని విమర్శించిన నోళ్లు మూతపడేలా ప్రగతి పాలనను అందించామని గులాబీ అధినేత గుర్తు చేశారు.



## దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల పునరుద్ధరణ

- వర్షాభావంపై రైతులకు అవగాహన
- నీటి వినియోగం తక్కువున్న పంటలపై వివరణ
- పంటల మార్పిడి, వైవిధ్యంపై రైతులకు తెలియచేయాలి
- అత్యవసర పనుల కోసం వేయికోట్ల నిధులతో పనులు
- వర్షాకాల సన్నద్ధతపై అధికారులతో సిఎం సమీక్ష
- స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన సిఎం రేవంత్ రెడ్డి

02



## ఆంధ్రా ప్రజలతో ఎప్పుడూ పేచీ లేదు

### పేచీ కేవలం అక్కడి నాయకులతోనే

### ఇక్కడ వేలు పెడతా..గరిటె తిప్పతామంటే తిప్పి కొడతాం

### పవన్ కళ్యాణ్‌కు టిఆర్ఎస్ అధినేత్రి కవిత ఘాటు హెచ్చరిక

**హైదరాబాద్,జూన్1 నేషనలిస్ట్ వాయిస్**

ఆంధ్రా ప్రజలతో తమకు ఏనాడు పేచీ లేదని, ఉన్నదల్లా అక్కడ ఇరాజకీయ నాయకులతోనే అని తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. వారు ఇక్కడ పెత్తనం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని ఘాటుగా హెచ్చరించారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాటాలు చేశామని కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'ఆంధ్రా, తెలంగాణ ప్రజల మధ్య ఎలాంటి విభేదాలు లేవు... ఆంధ్రా రాజకీయ నాయకులతోనే మన పంచాయితీ అన్నారు.

వివరాలు 2లో

## సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదురుగు జడ్జిలు

### కేంద్రన్యాయశాఖ నోటిఫికేషన్ విడుదల

**న్యూఢిల్లీ, జూన్1 నేషనలిస్ట్ వాయిస్**



సుప్రీం కోర్టులో ఐదుగురు కొత్త న్యాయమూర్తులను నియమించినట్లు కేంద్ర న్యాయశాఖ సోమవారం నోటిఫికేషన్ వెలువరించింది.

వివరాలు 2లో

## తెలంగాణపై విషం చిమ్ముతున్న పవన్ కళ్యాణ్

### -హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ ఏంటి ?-తెలంగాణ దిష్టి తగిలిందని ఆనాడు అనలేదా

### -బిజెపి ప్రోద్బలంతోనే పవన్ యాక్టింగ్-మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట,జూన్1 నేషనలిస్ట్ వాయిస్**

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ 'నవనిర్మాణ సభ' పెడతాననడాన్ని ఆయన ఆక్షేపించారు. భాజపాతో ఒప్పందం మేరకే పవన్ నటన ప్రారంభించారని ఆరోపించారు.

వివరాలు 2లో



## ముగిసిన ఐపిఎల్2026 సంబరం

### వరుసగా రెండోసారి కప్ప ఆరయల్స్ వశం

### కొత్త క్రికెటర్ల ప్రతిభను వెలికితెచ్చిన ఐపిఎల్

**న్యూఢిల్లీ,జూన్1 నేషనలిస్ట్ వాయిస్**



దాదాపు రెండునెలల పాటు సాగిన ఐపిఎల్ 2026 సంబరం ముగిసింది. ఎందరో క్రీడాకారులు తమ ప్రతిభను చాటారు. ముఖ్యంగా యువ క్రికెటర్లు ఎంతోమంది తమ సత్తా చాటారు. వైభవ్ సూర్యవంశీ లాంటి వారు భవిష్యత్ ఇంటియా టీమ్‌కు తురుపుముక్కలా కనిపించినట్లే. దాదాపు రెండున్నర నెలల పాటు అభిమానులు సమ్మర్ ఎంజయ్ చేశారు. ఆదివారం సాయంత్రం అహ్మదాబాద్‌లో జరిగిన ఐపీఎల్ ఫైల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఘన విజయం సాధించింది. వరుసగా రెండో సారి ఐపీఎల్ ట్రోఫీ సాధించింది.

వివరాలు 2లో

మొదటిపేజీ తరువాయి

# ఆంధ్రా ప్రజలతో ఎప్పుడూ పేచీ లేదు

ఆంధ్రా రాజకీయ నాయకుల ఏజెంట్ ఇక్కడ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఎక్కడ పడితే అక్కడ ఆంధ్రా వాళ్ల విగ్రహాలు పెడుతున్నారు. తెలంగాణపై ఏది పడితే అది మాట్లాడుతున్నారు.. దాని వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఇప్పుడు మళ్లీ ఏర్పడిందని కవిత అన్నారు. 'మేం అధికారంలోకి ఖచ్చితంగా వస్తాం. ఇక్కడ ఉన్న విగ్రహాలు కూల్చుతాం. తెలంగాణలో సెటిలర్స్ అంతా మావాళ్లే. రావచ్చు.. పోవచ్చు.. రొయ్యలు అమ్ముకోవచ్చు.. షూటింగ్‌లు చేసుకొని పోవచ్చు. సెక్రటేరియట్‌లో ఏపీ నాయకులు గంటె తిప్పుతామంటే ఊరుకోం. మేము టీఆర్ఎస్ 2.0 అని గుర్తు పెట్టుకోండి. మా విధానాల్లో వేలు పెడతాం.. మా అస్తిత్వాన్ని దెబ్బకొడతామంటే ఊరుకునేది లేదు' అని కవిత హెచ్చరించారు. మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణ పర్యటన రాష్ట్రంలో పొలిటికల్ హీట్ పెంచుతోంది. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. తెలంగాణ నవ నిర్మాణ సభ పేరుతో టీజీ జనసేన నేతలతో పవన్ కళ్యాణ్ సమావేశం నిర్వహిస్తున్న క్రమంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఈ క్రమంలో టీఆర్ఎస్ చీఫ్ కవిత పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ ముందు మీ సెక్రటేరియట్ లోకి నీళ్లు రాకుండా చూసుకోండి.. ఆ తర్వాత తెలంగాణ నవ నిర్మాణ సభ పెట్టుకోండని కవిత అన్నారు.టీఆర్ఎస్ 2.0తో పెట్టుకుంటే మూతి పళ్లు రాలుతాయని..ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ తెచ్చుకున్నా మని..మళ్లీ మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయని అన్నారు. ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.. తెలంగాణలో ఏపీ ఏజెంట్ సీఎంగా ఉండటంతో డ్రామాలు చేస్తున్నారని అన్నారు. మొదటిపేజీ తరువాయి

# సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదురుగు జడ్జిలు

ఈ జాబితాలో సీనియర్ న్యాయవాది వి మోహన, ప్రస్తుతం బాంబే హైకోర్టు సీజే జస్టిస్ శ్రీ చంద్రశేఖర్, ప్రస్తుత పంజాబ్ హరియాణా హైకోర్టు సీజే జస్టిస్ షీల్ నాగు,ప్రస్తుత మధ్యప్రదేశ్ హైకోర్టు సీజే జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ్ , జమ్మూకశ్మీర్ హైకోర్టు సీజే జస్టిస్ అరుణ్ పల్లి ఉన్నారు. ఇటీవలే సీజేఐ నేతృత్వంలోని కొలీజియం వీరి పేర్లను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. వీరిలో వి. మోహన ఒక్కరే సీనియర్ న్యాయవాది. న్యాయవాది మోహన 1988లో కోయంబత్తూరు లా కాలేజీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. అయిదేళ్ల లా డిగ్రీ మొదటి బ్యాచ్ విద్యార్థి. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ఇందు మల్హోత్రా, సీఎస్ వైద్యనాథన్‌ల వద్ద జూనియర్‌గా ఉన్నారు. 1996లో ఏఓఆర్ పరీక్ష పాసైన తర్వాత దిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్వతంత్రంగా ప్రాక్టీస్ ప్రారంభించారు. వివిధ కేసుల్లో సీనియర్ న్యాయవాదులు కపిల్‌సిబల్, కె.కె.వేణుగోపాల్, పి.చిదంబరం, అరున్‌జైట్లీ, అంద్యార్జునలతో కలిసి పనిచేశారు. 2015 ఏప్రిల్ 23న సీనియర్ న్యాయవాది హోదా పొందారు. ఈమె చేరికతో సుప్రీం కోర్టులో మహిళా జడ్జిల సంఖ్య 2కు చేరినట్లయింది. మొదటిపేజీ తరువాయి

# పశ్చమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

అంతర్జాతీయ జలాలపై ప్రయాణిస్తున్న తమ ఎంక్యూ1 డ్రోన్‌ను కూల్చివేయడం, ఇతర దుందుడుకు చర్యలకు ప్రతిస్పందనగానే తాము ఈ దాడి చేసినట్లు వెల్లడించింది. తమ దాడిలో ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ, గ్రౌండ్ స్టేషన్, రెండు అటాక్ డ్రోన్లు ధ్వంసమైనట్లు పేర్కొంది. వీటి నుంచి తమ యుద్ధ నౌకలకు ముప్పు పొంచి ఉన్నట్లు తెలిపింది. సిరిక్ ద్వీపంలోని టెలికామ్ టవర్స్‌పై అమెరికా దాడి చేసిందని ఇరాన్ ఐఆర్‌జీసీ వెల్లడించింది. దీనికి ప్రతిగా అగ్రరాజ్యం దాడికి వాడిన ఎయిర్‌బేస్‌ను తాము లక్ష్యంగా చేసుకొన్నామని ప్రకటించింది. ఐఆర్‌జీసీ ఏరోస్పేస్ ÷టైర్స్ ప్రతిదాడి చేశారని తెలిపింది. కానీ, ఏ బేస్‌పై దాడి చేశారో మాత్రం వెల్లడించలేదు. అయితే అంతకు కొన్ని గంటల ముందు కువైట్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ దాడులను గుర్తించి యాక్టివేట్ అయినట్లు వార్తలొచ్చాయి. హర్మూజ్‌ను నియంత్రించాలంటే ఇరాన్ ఖేష్మ్ మిసైల్ సిటీని కూడా ధ్వంసం చేయడం అమెరికాకు చాలా ముఖ్యం. ఇక్కడ అండర్‌గ్రౌండ్ సిటీలో యాంటీ షిప్ క్రూజ్ క్షిపణులు ఉన్నాయి. జలసంధిలోని నౌకలను లక్ష్యంగా చేసుకోవడం కోసం వీటిని వాడతారు. గడా 380, హెచ్‌వై-2 సిల్క్‌వార్మ్‌ను ఇరాన్ ఇక్కడ సిద్ధంగా ఉంచింది. ఇక బాలిస్టిక్ క్షిపణుల్లో 800 కిలోమీటర్ల రేంజ్ ఉన్న ఖియామ్-1, ఖైబర్ షెకన్, ఫద్ర, ఎమాద్ మిసైల్స్‌ను భద్రపర్చింది. వీటితోపాటు వేగంగా దాడి చేసే స్పీడ్‌బోట్స్, తీరప్రాంత క్షిపణి బ్యాటరీలు కూడా ఉన్నాయి.

మొదటిపేజీ తరువాయి

# బాల్కపై ఆస్తుల విధ్వంసం కేసు

బాల్క సుమన్‌పై కేసులో 2 సెక్షన్లు మాత్రమే వర్తిస్తాయని కోర్టు వెల్లడించింది. అతడిపై నమోదు చేసిన మిగిలిన సెక్షన్లను నాంపల్లి కోర్టు తొలగించింది. బాల్క సుమన్‌పై నమోదైన కేసు నేపథ్యంలో సోమవారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. సుమన్ రిమాండ్ రిజక్ట్ కోరుతూ మెమోను దాఖలు చేశారు. మే 26వ తేదీన తెలంగాణ భవన్‌లో టీబీజీకేఎస్ సమావేశంలో బాల్క సుమన్ మాట్లాడుతూ.. నాంపల్లిలోని సింగరేణి భవన్‌తోపాటు మందమర్రిలోని సింగరేణి జీఎం కార్యాలయంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై సింగరేణి భవన్ అధికారులు నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం తెలంగాణ భవన్‌లో బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతనికి నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

మొదటిపేజీ తరువాయి

# ఆదిలాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**ఆదిలాబాద్,జూన్1 నేషనలిస్ట్ వాయిస్**

ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆదిలాబాద్ ఆదివాసీల సొంతింటి కల నెరవేరాలని ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున పేదలకు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కాగజ్‌నగర్‌లో పర్యటించిన సీఎం.. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. తండాలు, గూడేల్లో ఉండే అర్హులైన ఆదివాసీ బిడ్డల కోసం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి నూరుశాతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి. గుడిసెలు లేని ఆదిలాబాద్ జిల్లాను నేను చూడాలనుకుంటున్నా. రాష్ట్రంలో సెప్టెంబర్ 17న మరో లక్ష గృహప్రవేశాలు చేస్తాం. కొత్తగా మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఈ వేదిక నుంచే మంజూరు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నానని అన్నారు. కాళేశ్వరంలో పెట్టిన రూ. లక్ష కోట్లు గోదావరిలో కలిసిపోయాయి. బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్‌లోని ప్రాజెక్టులను పట్టించుకోలేదు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి ఆదిలాబాద్‌లోని 2 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తాం. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల కోసం మహారాష్ట్ర సీఎంకు లేఖ రాశాను. అయినా అక్కడి నుంచి స్పందన లేదు. తెలంగాణ సీఎం అంటే మహారాష్ట్ర సీఎంకు ఎందుకంత చిన్నచూపు అని అన్నారు. సమస్య పరిష్కరించడానికి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని మరోమారు డిమాండ చేశారు. పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని 7 గ్రామాలను ఏపీలో కలపలేదా? తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రకు కలిగే నష్టాన్ని భరిస్తాం. మహారాష్ట్ర నుంచి 2వేల ఎకరాలు మాత్రమే అడుగుతున్నాం అని అన్నారు.ఇకపోతే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇండ్లను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కొమురం భీం జిల్లాలో పర్యటించిన సీఎం.. కోలామ్ ఆదివాసీ బిడ్డల ఇందిరమ్మ గృహప్రవేశాలు చేయించారు. కొత్తగూడలో 25 ఇండ్ల సామూహిక గృహ ప్రవేశాల సందర్భంగా.. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇండ్ల గృహ ప్రవేశాన్ని ప్రారంభించారు. కోలామ్ ఆదివాసీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించిన విషయం తెలిసిందే. గృహ ప్రవేశం సందర్భంగా కొత్త ఇందిరమ్మ ఇంట్లో ఆదివాసీలతో కలిసి ఇప్పపువ్వు లడ్డు తిన్నారు సీఎం. గృహ ప్రవేశం సందర్భంగా ఆడబిడ్డలకు పట్టు బట్టలు అందించారు..

# దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల పునరుద్ధరణ

మొదటిపేజీ తరువాయి

**హైదరాబాద్,జూన్1 నేషనలిస్ట్ వాయిస్**

వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తక్కువ నీరు వినియోగించుకునే పంటలపై రైతులకు వివరించాలన్నారు. పంట మార్పిడి ప్రాధాన్యాన్ని అన్నదాతలకు తెలియజేయాలని సీఎం ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సమీక్ష జరిగింది. ఈ సమావేశానికి వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఆరోగ్య, హోం, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. నైరుతి రుతుపవనాలతో వచ్చే వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, ఇతర అంశాలపై వాతావరణ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణలో ప్రాజెక్టుల మెయింటెనెన్స్ పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. గేట్లు, నిర్వహణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల మెయింటెనెన్స్‌కు అవసరమైన నిధులు తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విపత్తు నిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ.1000కోట్లను నిబంధనల ప్రకారం వినియోగించాలన్నారు. దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల నిర్మాణానికి అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం వాటిల్లినప్పుడు తక్షణమే అధికారులు స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఆరోగ్య, హోమ్, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా రైతులకు వర్షాభావ పరిస్థితులపై ముందస్తు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. అలాగే పంటల మార్పిడి, పంటల వైవిధ్యీకరణ వల్ల కలిగే ప్రయోజనాలను అన్నదాతలకు వివరించాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతుల పనులపై కూడా సీఎం ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రాజెక్టుల గేట్లు, ఇతర నిర్వహణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల పునర్నిర్మాణానికి అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణనష్టం, ఆస్తి నష్టం, పశువుల నష్టం వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు అధికారులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా రామగుండం ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే యూరియా మొత్తం తెలంగాణ రైతుల అవసరాల కోసం కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

# తెలంగాణపై విషం చిమ్ముతున్న పవన్ కళ్యాణ్ విషం

మొదటిపేజీ తరువాయి

తెలంగాణను భాజపాకు తాకట్టు పెట్టడమే ఆయన చెప్పే నవనిర్మాణమా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల దిష్టి తగిలి కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని పవన్ గతంలో అన్నారని.. ఆ వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 11 రోజులు అన్నం మానేశానని పవన్ చెప్పారని గుర్తుచేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పవన్ కళ్యాణ్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా గతంలో వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ ముందుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆ తర్వాతే హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గతంలో మాట్లాడారని.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం తినలేదని బహిరంగంగా చెప్పారని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణపై విషం కక్కుతూ, తెలంగాణ ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి ఇక్కడ సభ నిర్వహించే నైతిక హక్కు లేదన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే అదే రోజున హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ నిర్వహించడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణలో విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందాలనే ప్రయత్నం జరుగుతోందని, ఇందులో బీజేపీతో పవన్ కళ్యాణ్‌కు లోపాయికారీ ఒప్పందం ఉందని విమర్శించారు. తెలంగాణ ప్రజలపై గతంలో చేసిన వ్యాఖ్యలకు పవన్ కళ్యాణ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన వ్యక్తి ఇక్కడికి వచ్చి సభలు నిర్వహించడం సమంజసం కాదన్నారు. 'తెలంగాణ కళ్ల దృష్టి పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతాయని చెప్పిన పవన్ కళ్యాణ్, తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలి' అని వ్యాఖ్యానించారు. అలాగే నవనిర్మాణ సభను గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో కాకుండా హైదరాబాద్‌లోనే ఎందుకు నిర్వహిస్తున్నారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ నాయకత్వాన్ని మెప్పించడానికే తెలంగాణలో సభలు పెడుతున్నారా అని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు పవన్ కళ్యాణ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని, అక్కడి సమస్యలపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ వంటి కీలక అంశాలపై పోరాడకుండా తెలంగాణలో రాజకీయాలు చేయడం సరైన విధానం కాదన్నారు. తెలంగాణపై వ్యతిరేక భావజాలంతో వ్యవహరించిన పవన్ కళ్యాణ్ తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేకపోతే ప్రజలు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే ఇక్కడ నవ నిర్మాణ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్... ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు.

మొదటిపేజీ తరువాయి

# పేదలకు నేరుగా పెన్షన్ ఇస్తేనే ఆనందం


గతంలో ఒక నెల పెన్షన్ తీసుకోకపోతే రద్దుచేశారని తెలిపారు. ఒక్కో కుటుంబానికి 4 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అసెంబ్లీలో మహిళలకు 33 శాతం సీట్లు ఇచ్చి రాజకీయంగా ఎదిగేలా చేస్తామని వ్యాఖ్యానించారు. రైతుల ఉత్పత్తులు ప్రపంచానికి ఎగుమతి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్యాస్ ధరలు పెరిగినా మహిళలకు ఉచిత సిలిండర్లు సరఫరా చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలవద్దని తాను, పవన్ కల్యాణ్ కలిశామని ప్రస్తావించారు. మూడు పార్టీలు కలిసి ఎన్నికలకు వెళ్లామని.. మూడు పార్టీలు కలిసింది ఈ జూన్‌లోనే అని చెప్పారు. జూన్ నెలకో ప్రత్యేకత ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తుని తెలుగుదేశం పార్టీకి కంచుకోట అని తెలిపారు. దుర్మార్గులతో యుద్ధం చేయాల్సి వస్తోందని అన్నారు. కత్తులు, కటారాలు తీసుకొచ్చినా ఫర్వాలేదు.. ఇక్కడ తాను ఉన్నానని తెలిపారు. రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. నంద్యాలలో మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని వైసీపీ నేతలే ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. ఆ నెపాన్ని టీడీపీపై నెట్టాలని చూశారని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## జిల్లాలో షెడ్యూల్ మండలాల్లో చట్టాలకు రక్షణ కరువైంది ఏవీఎస్పీ డిమాండ్....?

**జిల్లా కలెక్టర్ కి ఏవీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మల్లు దొర విన్నవిస్తూ**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి జూన్ 01.**

ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసి ప్రాంతాలలో ఆదివాసి చట్టాలు ఆదివాసి బిడ్డలకు పుష్కలంగా ఉన్న చట్టాలు ఎస్ టి లకు అమలు కావడంలో శూన్యమని ఏజెన్సీ మండలాల్లో ఆదివాసీలకు వ్యతిరేకంగానే ఏజెన్సీ చట్టాలను కొందరు అధికారులు అర్హత లేని అక్రమార్కులకి దోచిపెడుతున్నారని వాపోయారు ఏజెన్సీ మండలాల్లో ఉన్నటువంటి వనరులు నిజమైన ఎస్టీలు నిరుపేద ఎస్టీలు అందిపుచ్చుకోవడంలో అవినీతి అధికారులు వలన అందుకోలేక విఫలమవుతున్నారని వాపోయారు స్థానిక మండల కార్యాలయ అధికారులకు ఫిర్యాదులు చేసిన ఉపయోగాలేని విధంగా ఉందని ఆయన తెలిపారు ఏజెన్సీ ప్రాంతంలో భూ సమస్యలు ఆదివాసులకు పరిష్కారం కావట్లేదని ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా భూములు కొన్న వాళ్లకి భూములు ఆకుపై చేసిన వలస గిరిజనేతరులకు ముడుపులు చెల్లించిన వారికి మాత్రం ఎమర్జెన్సీగా భూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని ఇది మాత్రం వాస్తవం ఏజెన్సీ ప్రాంతాలలో క్షుణ్ణంగా పరిశీలిస్తే కొన్ని నిజాలు బహిర్గతం అవుతాయని ముక్తకంఠంతో అన్నారు ఏజెన్సీ చట్టాలను చుట్టాలుగా మార్చుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అలాగే షెడ్యూల్ ప్రాంతాలలో అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు అందించాలి కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని అంటుంటే కానీ అధికారులు మాత్రం రేషన్ కార్డు దరఖాస్తుదారులను మాత్రం ముప్పు తిప్పలు పెట్టే సూచనలు కనిపిస్తున్నాయని విన్నవించారు కొత్త రేషన్ కార్డులు కోసం గత సంవత్సరం దరఖాస్తు చేస్తే ఇప్పటివరకు దిక్కు ముక్కు లేదని దరఖాస్తుదారులను మాత్రం ఆఫీసుల చుట్టూ తిప్పిస్తూ పబ్బం గడుపుతున్న తరుణం కనిపిస్తుందని వాపోయారు స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో రేషన్ కార్డు కొరకు వెళ్లి అడిగితే పంపించామంటున్నాడు కానీ కలెక్టరేట్ ఆఫీసులో అడిగితే రాలేదు అంటున్నారు ఎంత నిర్లక్ష్యం వహిస్తున్నారు అధికారులు గమనించాల్సిన పరిస్థితి ఉందని వాపోయారు ఉమ్మడి కుటుంబ రేషన్ కార్డులో ఉన్న పేర్లను తొలగించి దరఖాస్తుదారులు లబోదిబో అంటున్నారని ఉన్నది పోయో ఉంచుకున్నది పాయో అన్న విధంగా దరఖాస్తుదారుల పరిస్థితి ఉందని ఫిర్యాదు చేశారు కనుక తమ చొరవతో కొత్త రేషన్ కార్డ్ కొరకు దరఖాస్తు చేసిన దరఖాస్తుదారులకు రేషన్ కార్డులు మంజూరు పెంచాలని కలెక్టర్ ని కోరుతూ కార్యక్రమంలో ఏఎస్పి నాయకులు తెల్లం రవి పూణెం రామకృష్ణ కుమార్ నాగేశ్వరావు తదితరులు



# ముగిసిన ఐపిఎల్2026 సంబరం

గుజరాత్ టైటాన్స్ నిర్దేశిరచిన 156 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో గుజరాత్ టైటాన్స్‌ను ఐదు వికెట్ల తేడాతో ఓడించిన ఆర్సీబీ వరుసగా రెండో ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఐపీఎల్ 2026 ఫైల్ పోరులో గుజరాత్ టైటాన్స్‌పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వరుసగా రెండోసారి ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' విరాట్ కోహ్లీ 75 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ నేపథ్యంలో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటీదార్ మ్యాచ్ అనంతరం మాట్లాడాడు. విరాట్ కోహ్లీపై ప్రశంసల వర్షం కురిపించాడు. దాంతోపాటు ట్రోఫీని ఈసారి కూడా అభిమానులకే అంకితం చేస్తున్నట్లు వెల్లడించాడు.'కోహ్లీ గురించి చెప్పడానికి నాకు మాటలు రావడం లేదు. కెరీర్‌లో అతడు సాధించలేనిది అంటూ ఏమీ లేదు. విరాట్ ఎంత గొప్ప ఆటగాడో కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. మైదానంలోనే కాదు.. బయట కూడా అతడి నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. జట్టులోని ప్రతి ఆటగాడితో మాట్లాడుతుంటాడు. క్రికెట్‌కు సంబంధించిన విషయాలే కాకుండా జీవితానికి ఉపయోగపడే అంశాలపై కూడా సూచనలు ఇస్తుంటాడు. నేను ఎప్పుడూ విరాట్‌ను గమనిస్తూ ఉంటాను. నెట్స్‌లో అతడు చూపించే ఉత్సాహం, మ్యాచ్‌లో కనిపించే ఎనర్జీ ఒకేలా ఉంటాయి. అదే కోహ్లీ ప్రత్యేకత' అని పాటీదార్ వెల్లడించాడు. ఈ సీజన్‌లో విరాట్ 675 పరుగులు చేశాడు. అందులో ఒక సెంచరీ, ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. వరుసగా రెండో కప్పును సొంతం చేసుకోవడం ఆనందంగా ఉంది.÷నైల్ కోసం ఇక్కడికి వచ్చాక గతేడాది జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయి. అప్పుడు ఎలా ఆడామో.. ఇప్పుడు కూడా అదే దూకుడును ప్రదర్శించాం. జట్టులోని ప్రతి బౌలర్‌ను నేను మెన్షన్ చేయాలి. కెప్టెన్‌గా ఇక్కడ నా ప్రయాణం అద్భుతం. గతేడాది మాపై తీవ్ర ఒత్తిడి ఉండేది. కానీ ఈసారి అంచనాలు ఉన్నప్పటికీ ఒత్తిడి లేకపోవడంతో స్వేచ్ఛగా ఆడాం. తొలి మ్యాచ్ నుంచే దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించాం. మేం ఎక్కడికి వెళ్లినా అభిమానులు పెద్ద ఎత్తున వచ్చి ప్రోత్సహించారు.

## తొర్రూరూ లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు ఘనంగా ప్రారంభం

**ప్రారంభించిన చైర్మన్ తూనం.శ్రవణ్ కుమార్**

**తొర్రూరు జూన్ 01 ( నేషనలిస్ట్ వాయిస్)**

ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సూచన ల తో తొర్రూరు పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహ ప్రవేశ కార్యక్రమాన్నిమున్సిపల్,చైర్మన్,తూనం.శ్రవణ్.కుమార్ ,ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ పేద మరియు మధ్య తరగతి కుటుంబాలు సొంత ఇంటి కలను సాకారం చేసుకోవడంఎంతో,ఆనందదాయకమని ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. కొత్త ఇంటిలో అడుగుపెట్టిన కుటుంబాలు,సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, వైస్ చైర్మన్ సోమరజనీరాజశేఖర్ , హౌసింగ్ ఏ ఈ. హిమబిందు, కౌన్సిలర్ ముద్దసాని సురేష్ , జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బొమ్మన బొయిన వెంకన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటచారి, మాజీ కౌన్సిలర్ దొంగరి శంకర్, తాల్లపల్లి బిక్షం గౌడ్, నల్లపు రాజు, మార్క అరుణ్, తూర్పాటి రాంబాబు, పెద్ది ప్రవిన్, సట్ల చంటి, తంగలపెల్లి అన్వేష్, డొనక ఉపేందర్, రాజు, సునిల్, అధికారులు, ఆర్ పీ లు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

**మందమర్రి, జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్):**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో పట్టణంలోని బిఆర్ఎస్, దాని అనుబంధ సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బిఆర్ఎస్ నాయకుల మీద అక్రమ కేసులు పెట్టి, అరెస్ట్ చేయడంలో ఉన్న శ్రద్ధ, కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో లేదని ఎద్దేవా చేశారు. ఇచ్చిన 420 హామీలు అమలు చేయక, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే అక్రమ అరెస్టులతో రేవంత్ ప్రభుత్వం ప్రజల దృష్టి మళ్లిస్తూ, రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. ప్రజల దృష్టిని మళ్లించడానికే వివాక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ, పోలీస్ వ్యవస్థను రాజకీయ అవసరాలకు వాడుకుంటుందని ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. అదేవిధంగా విద్యార్థుల న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్న నాయకులను అణిచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని తెలిపారు. ఫీజు రియంబర్స్ మెంట్ సమస్యతో వేలాదిమంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ లో ఉన్న ఫీజ్ రియంబర్స్ మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యార్థులపై , విద్యార్థి నాయకులపై జరుగుతున్న అణిచివేత చర్యలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పూర్తిగా పరిష్కారం అయ్యేవరకు ఉద్యమం నిరంతరం కొనసాగుతుందని, విద్యార్థి హక్కుల కోసం పోరాటం ఎప్పటికీ ఆగదని స్పష్టం చేశారు. అరెస్టు అయిన వారిలో బిఆర్ఎస్ నాయకులు ఏల్పుల రవీందర్, లౌడం రాజ్ కుమార్, ఎండి ఫిరోజ్, సది, తోట సురేందర్, దాసరి నవీన్, సీపెల్లి సాగర్, మాసు వెంకటేష్, అందే శ్రీకాంత్, ఎండి పాషా లు కలరు.



# ప్రతి ఒక్కరూ భద్రత నిబంధనలు తప్పక పాటించాలి

## ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ

**మందమర్రి, జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్):**

సింగరేణిలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి సంస్థ నిర్దేశించిన భద్రత నిబంధనలను, సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపిఎస్) ను తప్పనిసరిగా పాటించాలని సింగరేణి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ తెలిపారు. సింగరేణి కార్పోరేట్ సేఫ్టీ విభాగం ఆదేశాల మేరకు ప్రత్యేక భద్రత అవగాహన వారోత్సవాలు సోమవారం నుండి ప్రారంభం కాగా, ఏరియాలోని కేకే ఓసిపి గని పై నిర్వహించిన కార్యక్రమానికి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ఓబి ఆఫ్ లోడింగ్ కార్మికులకు భద్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జూన్ 1 నుండి 6 వరకు ప్రత్యేక భద్రత అవగాహన వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ప్రదేశంలో నిరంతరం అప్రమత్తంగా ఉండటం, వ్యక్తిగత రక్షణ పరికరాలను సంపూర్ణంగా వినియోగించడం, భారీ యంత్రాలు నిర్వహణలో తగిన జాగ్రత్తలు పాటించడం వల్ల ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చునని వివరించారు. భద్రత పట్ల ప్రతి ఒక్కరు బాధ్యతాయుతమైన వైఖరిని కలిగి ఉండాలని సూచించారు. సింగరేణిలో సురక్షితమైన పని వాతావరణాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతి ఉద్యోగి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓసిపి ఇంచార్జ్ ప్రాజెక్ట్ అధికారి రాంబాబు, మేనేజర్ రామరాజు, ఇంచార్జ్ ఏరియా రక్షణ అధికారి వెంకట్ రెడ్డి, రక్షణ అధికారి పైడయ్య, ఎక్స్ ప్రెస్ వే జిఎం దినేష్ చౌదరి, సింగరేణి అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.



### మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి సరస్వతి అంత్య పుష్కరాల్లో పాల్గొన్న పరిగి మాజీ వైస్ ఎంపీపీ డి. మాణిక్యం, పలువురు నాయకులు

**పరిగి (నేషనలిస్ట్ వాయిస్, ప్రతినిధి) జూన్ 01**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాలేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాల్లో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి తో కలిసి పరిగి మాజీ వైస్ ఎంపీపీ డి. మాణిక్యం, పలువురు నాయకులు పుణ్య స్థాన్నాలు ఆచరించి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెంచాలి-జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం,జూన్1(నేషనలిస్ట్ వాయిస్):**

పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెంచాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా స్థాయి పర్యావరణ పరిరక్షణ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డీఆర్ఓ పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ఒక శాఖ బాధ్యత మాత్రమే కాదని సమాజంలోని ప్రతి వ్యక్తి బాధ్యతగా భావించి ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ మార్పులు పెరుగుతున్న కాలుష్యం సహజ వనరుల క్షీణత వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టనున్న కార్యక్రమాలను గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 1 నుండి 12 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమాలు ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని పెం పొందించేలా ఉండాలని ప్రతి గ్రామం విద్యాసంస్థలు ప్రతి ప్రభుత్వ కార్యాలయం ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని నాటిన ప్రతి మొక్కను పెంచి పెద్ద చెట్టుగా తీర్చిదిద్దినప్పుడే కార్యక్రమం విజయవంతమవుతుందని అన్నారు.

అనంతరం జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యాచరణలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని శాఖల అధికారులు తమ తమ పరిధిలో సమన్వయంతో పనిచేయాలని




కోరారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు 55 లక్షల మొక్కల నాటే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని ఆ లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50 శాతానికి పైగా అటవీ విస్తీర్ణం ఉందని అన్ని శాఖల సమన్వయంతో గత రెండు సంవత్సరాలుగా ఒక్క ఎకరం పోడు భూమి కూడా నరికివేయకుండా సంరక్షించగలిగామని తెలిపారు. జిల్లాలో పామాయిల్ జామాయిల్ వెదురు తదితర పంటల సాగు విస్తరించడంతో జిల్లా పచ్చదనంతో కళకళలాడుతోందని రాష్ట్రంలో పచ్చదన పరిరక్షణలో జిల్లా రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన పర్యావరణ పరిరక్షణ గోడపత్రికను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆవిష్కరించారు. అనంతరం అటవీ శాఖ సిబ్బంది విధుల నిర్వహణలో భద్రతకు ఉపయోగపడే సేఫ్టీ కిట్లను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సమావేశంలో అటవీ శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయండి

## -సింగరేణి జిఎం పర్సనల్ కవితా నాయుడు- వేడుకలకు హాజరుకానున్న సింగరేణి చైర్మన్ బుద్ధ ప్రకాష్ జ్యోతి

**భద్రాద్రి కొత్తగూడెం,జూన్1(నేషనలిస్ట్ వాయిస్):**

సింగరేణి కార్పొరేట్ ఆధ్వర్యంలో ఈనెల రెండవ తేదీన సింగరేణి ప్రకాశం స్టేడియం గ్రౌండ్ నందు జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని సింగరేణి జిఎం పర్సనల్ కవితా నాయుడు తెలిపారు. సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ నున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సింగరేణియులు వారి కుటుంబ సభ్యులు కార్మిక సంఘాల ప్రతినిధులు కొత్తగూడెం పట్టణ ప్రజలు పరిసర ప్రాంత వాసులు అధిక సంఖ్యలో పాల్గొని సంబరాలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. వేడుకలకు ముఖ్య అతిథిగా సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి పాల్గొంటారని తెలిపారు. మొదటగా సింగరేణి హెడ్ ఆఫీస్ లో జాతీయ జెండా ఆవిష్కరణ ఉంటుందన్నారు. తర్వాత తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ప్రకాశం స్టేడియం నుండి కొత్తగూడెం బస్టాండ్ వద్ద గల తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు తెలంగాణ రన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. సాయంత్రం ప్రకాశం స్టేడియం నుండి కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ వద్ద గల తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అమరులైన తెలంగాణ వీరులకు నివాళులు అర్పించే కార్యక్రమం ఉంటుందని వివరించారు. అదేరోజు సాయంత్రం స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ సాంస్కృతిక ఉత్సవాలకు ప్రముఖ సినీ టీవీ కళాకారుల బృందం పాల్గొని ప్రదర్శనలు చేయనున్నారని చెప్పారు.



ప్రముఖ సింగర్లు సాయి శ్రీ చరణ్, నసిరుద్దీన్, సత్యభామ స్వాతి, రజని, వెన్నెల, సద్దాంలు వస్తున్నారని చెప్పారు. ప్రముఖ శాస్త్రీయ నృత్య కళాకారుని డాక్టర్ సీతా ప్రసాద్ బృందం వారిచే నిత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవ దినోత్సవ వేడుకలకు సంబంధించిన వాల్ పోస్టర్ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ సి ఎస్ ఆర్ అజయ్ కుమార్, డీజిఎం పర్సనల్ వెల్ఫేర్ కేసా నారాయణరావు, శివ కేశవరావు, అధికారులు శ్రీనివాస్, వరప్రసాదరావు, స్పోర్ట్స్ సూపర్వైజర్ ఎంసీ పోస్ నెట్ తదితరులు పాల్గొన్నారు.

# తూప్రాన్ మండలంలో పంచాయతీ కార్యదర్శుల బదిలీలు, కొత్త నియామకాలు

**తూప్రాన్, జూన్ 1 : నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

తూప్రాన్ మండలంలోని గ్రామ పంచాయతీల పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పలువురు పంచాయతీ కార్యదర్శులకు బదిలీలు, నియామకాలు చేపట్టినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) ఎన్. సతీష్ తెలిపారు. మెదక్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ బదిలీలు, నియామకాలు అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. వివిధ మండలాలైన కోహెడ, చేగుంట, మనోహరాబాద్ ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన ఏడుగురు పంచాయతీ కార్యదర్శులను తూప్రాన్ మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు కేటాయించారు. అలాగే మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్యదర్శులను పరిపాలనా అవసరాల దృష్ట్యా ఇతర గ్రామాలకు బదిలీ చేశారు. ఉత్తర్వుల ప్రకారం చేగుంట మండలం చేత్ల తిమ్మాయిపల్లి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శి జె. రమేష్ను గుండ్రెడ్డిపల్లి గ్రామ పంచాయతీకి బదిలీ చేశారు. కోహెడ మండలం వారికోల్ గ్రామం నుంచి గ్రేడ్-3 కార్యదర్శి డి. సతీష్ కుమార్ను కోనాయిపల్లి (పిబి) గ్రామ పంచాయతీకి నియమించారు. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి నుంచి గ్రేడ్-4 కార్యదర్శి పి. స్వామి గౌడ్ను నరసంపల్లి గ్రామ పంచాయతీకి బదిలీ చేశారు.అదేవిధంగా వెంకటరత్నాపూర్ గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కె. కళ్యాణిని వెంకటాయపల్లి గ్రామానికి బదిలీ చేయగా, గుండ్రెడ్డిపల్లి గ్రామంలో పనిచేస్తున్న ఎ. మహేశ్వరిని మల్కాపూర్ గ్రామ పంచాయతీకి నియమించారు. కోనాయిపల్లి (పిబి)లో విధులు నిర్వహిస్తున్న జె. అన్నపూర్ణను వెంకటరత్నాపూర్ గ్రామ పంచాయతీకి బదిలీ చేశారు.యావాపూర్ గ్రామంలో డెప్యుటేషన్పై ఉన్న గ్రేడ్-3 కార్యదర్శి చ. అరుణ డెప్యుటేషన్ను రద్దు చేసి కిష్టాపూర్ గ్రామ పంచాయతీలో నియమించారు. కుల్చారం మండలం పోతిన్శెట్టిపల్లి గ్రామం నుంచి గ్రేడ్-4 కార్యదర్శి వి. అరుంధతిని తూప్రాన్ మండలంలోని యావాపూర్ గ్రామ పంచాయతీకి బదిలీ చేశారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులందరూ జూన్ 1వ తేదీ మధ్యాహ్నం లోపు తమకు కేటాయించిన గ్రామ పంచాయతీలలో విధుల్లో చేరాలని ఎంపీడీఓ ఎన్. సతీష్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ బదిలీలు, నియామకాలతో గ్రామ పంచాయతీల్లో పరిపాలనా పనులు మరింత వేగవంతం అవుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# విభాగాల కార్మికులపై చిన్న చూపు తగదు

## -ఫిల్టర్ బెడ్ల వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి

## -సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాజేందర్, వెంకటస్వామి

**మందమర్రి, జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్):**

సింగరేణి యాజమాన్యం విభాగాల కార్మికుల పట్ల చిన్నచూపు చూడడం తగదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి అల్లి రాజేందర్, బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్ వెంకటస్వామి లు సూచించారు. యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఏరియాలోని సివిల్ విభాగాన్ని యూనియన్ పిట్ కార్యదర్శి ఆగిటి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా రాజేందర్, వెంకటస్వామి లు మాట్లాడుతూ, ఫిల్టర్ బెడ్ లపై సరైన సెక్యూరిటీ లేకపోవడంతో దొంగలు బెడద అధికంగా ఉందన్నారు. ఫిల్టర్ బెడ్ లలో ఇటీవల దొంగతనాలు జరగడం వల్ల విధుల్లో ఉన్న పంపు డ్రైవర్లు భయాందోళనలకు గురి అవుతున్నారని, గతంలో మాదిరిగా సెక్యూరిటీ సిబ్బందిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సివిల్ విభాగంలో సూపర్వైజర్ ల కొరత ఉన్నందున మరొక సూపర్వైజర్ ను నియమించాలని, వాల్ మెన్ లకు పదోన్నతి ఇచ్చిన, వారికి ఇప్పటివరకు పనిముట్లు ఇవ్వలేదని, ఫిట్టర్ లకు టూల్స్ ఇవ్వాలేదని, సివిల్ విభాగం కార్మికులకు సరైన పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రానున్న వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని అవుట్డోర్లో విధులు నిర్వహిస్తున్న వాల్ మెన్, ఇతర సిబ్బందికి రెయిన్ కోట్లు



ఇవ్వాలన్నారు. పాత వాల్ ఛాంబర్లు అన్నింటినీ మరమ్మతులు చేసి, ఇసుకతో నింపాలని తెలిపారు. యాక్టింగ్ ప్యానల్ లిస్టును ప్రదర్శించి, పదోన్నతులు ఇవ్వాలని, కొత్త పనిముట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. సివిల్ విభాగంలో నెలకొన్న సమస్యలను త్వరలో జిఎం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సివిల్ విభాగం అధికారులు దేవి కుమార్, రాకేష్ లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బోనాల మహేందర్, బాసబోయిన కుమారస్వామి, కే శ్రీనివాస్, పినగాని శంకర్, ఆవాల రాజశేఖర్ రెడ్డి, పంజా ప్రవీణ్, జి కరుణాకర్ లు పాల్గొన్నారు.

# ప్రపంచ చెస్ రంగంలో తెలంగాణ చిన్నారి సంచలనం



**నేషనలిస్ట్ వాయిస్ స్పోర్ట్స్ ప్రత్యేక ప్రతినిధి, జూన్ 1,**

తెలంగాణ గడ్డ మరోసారి ఓ అరుదైన ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసింది. మెదక్ జిల్లా రామాయంపేట పట్టణానికి చెందిన బాల మేధావి అశ్విక గౌడ్ తన అసాధారణ ప్రతిభతో ప్రపంచ చెస్ రంగంలో సంచలనం సృష్టిం చింది. బుడి బుడి అడుగులు వేసిన చిన్న వయస్సులోనే మేధస్సు, ఏకాగ్రత, చురుకుదనం, పట్టుదలతో చెస్ క్రీడలో అద్భుత ప్రతిభ కనబరిచిన ఈ చిన్నారి తాజాగా రెండు అంతర్జాతీయ ప్రపంచ రికార్డులను సాధించి తెలంగాణ రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచింది.

సాధారణంగా ప్రపంచ స్థాయి రికార్డులు సాధించాలంటే ఎన్నో సంవత్సరాల కఠోర సాధన, అనుభవం, పోటీలు అవసరం. అయితే అశ్విక గౌడ్ చిన్న వయస్సులోనే ఆ స్థాయికి చేరుకుని అందరినీ ఆశ్చర్య ఎపరిచింది. ఇటీవల నిర్వహించిన ప్రత్యేక చెస్



చాలెంజ్‌లో 120 చెస్ టేబుళ్లను కేవలం 8 నిమిషాల 56 సెకండ్లలో పూర్తి చేసి అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఈ అద్భుత ప్రదర్శనతో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ -- లండన్ మరియు ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్స్ ఆఫ్ ఎక్సలెన్సీ సంస్థల నుంచి ప్రపంచ రికార్డు గుర్తింపును పొందింది. ఈ విజయంతో అశ్విక పేరు అంతర్జాతీయ స్థాయిలో మారు మోగుతోంది. చెస్ ప్రపంచంలో పెద్దలు మాత్రమే కాదు, క్రీడా నిపుణులు, విద్యావేత్తలు, రాజకీయ ప్రముఖులు కూడా ఈ చిన్నారి ప్రతిభను కొనియాడుతున్నారు. చిన్నారి లో చిన్న వయస్సులోనే



వెలుగొందిన అసాధారణ ప్రతిభ అశ్విక గౌడ్ బాల్యం నుంచే మేధో క్రీడల పట్ల ప్రత్యేక ఆసక్తిని కనబరిచింది. ఇతర పిల్లలు ఆటపాటలతో కాలం గడుపుతుంటే, అశ్విక మాత్రం చెస్ బోర్డు ముందు గంటల తరబడి కూర్చుని ఎత్తులు, వ్యూహాలు నేర్చుకునేది. ఒక కదలిక వెనుక దాగి ఉన్న అవకాశాలను గుర్తించే నైపుణ్యం చిన్న వయస్సులోనే ఆమెలో కనిపించింది.

చెస్ అనేది కేవలం ఆట మాత్రమే కాదు. అది ఏకాగ్రత, సహనం, వ్యూహాత్మక ఆలోచన, నిర్ణయ సామర్థ్యానికి ప్రతీక. అలాంటి ఆటలో ప్రపంచ రికార్డులు సాధించడం అంటే అసాధారణ మేధస్సుకు నిదర్శనం. ఆ ప్రతిభను అశ్విక ఎంతో చిన్న వయస్సులోనే నిరూపించింది.

## గురువుల శిక్షణ -- విజయానికి పునాది

అశ్విక విజయానికి వెనుక ఉన్న ప్రధాన శక్తి ఆమె గురువుల కృషి. డైమండ్ చెస్ అకాడమీకి చెందిన పల్లె అంకిత గౌడ్ మరియు దివ్యశ్రీ అందించిన ప్రత్యేక శిక్షణ, నిరంతర మార్గదర్శకత్వం ఆమెను ఈ స్థాయికి తీసుకువచ్చాయి. చెస్‌లో ప్రతి కదలికను శాస్త్రీయంగా విశ్లేషించడం, వేగం పెంచడం, ఏకాగ్రతను నిలబెట్టుకోవడం, ప్రత్యర్థి ఎత్తులను ముందుగానే అంచనా వేయడం వంటి అంశాల్లో గురువులు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆ శిక్షణ ఫలితంగానే అశ్విక ప్రపంచ రికార్డులను అందుకుంది.

తల్లిదండ్రుల ప్రోత్సాహం -- విజయానికి బలమైన అండ

పిల్లల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత. అశ్విక విషయంలో ఆమె తల్లిదండ్రులు అక్షిత గౌడ్, సాయి హితార్థ గౌడ్ అదే చేశారు. చిన్న వయస్సులోనే కూతురి ప్రతిభను గుర్తించి చెస్ శిక్షణ అందించారు. అవసరమైన ప్రతి సదుపాయం కల్పిస్తూ ఆమె లక్ష్యసాధనలో అండగా నిలిచారు. విజయవంతమైన క్రీడాకారుడి వెనుక కుటుంబం ఎంత ముఖ్యమో అశ్విక ప్రయాణం మరోసారి నిరూపించింది.

తాత పల్లె రామచంద్రం గౌడ్ ఆనందానికి అవధులు లేవు

ప్రముఖ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచంద్రం గౌడ్ మనవరాలిగా అశ్విక కుటుంబంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. మనవరాలు ప్రపంచ రికార్డులు సాధించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారి సాధించిన ఘనత కుటుంబానికే కాదు, రామాయంపేట పట్టణానికి, మెదక్ జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా ఎదగాలని ఆకాంక్షించారు.

## మంత్రుల చేతుల మీదుగా ఘన సన్మానం

హైదరాబాద్ లోని మినిస్టర్స్ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్, బీసీ సంక్షేమ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అశ్విక గౌడ్‌ను ప్రత్యేకంగా అభినం దించిన మంత్రులు, చిన్న వయస్సులోనే ప్రపంచ స్థాయి రికార్డులు సాధించడం గొప్ప విషయమని కొనియాడారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ చెస్ పోటీల్లో మరిన్ని విజయాలు సాధించి దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, గురువులు, కుటుంబ సభ్యులను కూడా శాలువాలతో ఘనంగా సత్కరించారు.

రామాయంపేట నుంచి ప్రపంచ వేదిక వరక

ఒక చిన్న పట్టణంలో ప్రారంభమైన ప్రయాణం నేడు ప్రపంచ వేదిక వరకు చేరడం అశ్విక పట్టుదలకు నిదర్శనం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి కూడా ప్రపంచ స్థాయి ప్రతిభ వెలుగులోకి రావచ్చని ఈ చిన్నారి నిరూపించింది.

అశ్విక విజయం ప్రస్తుతం తెలంగాణలోని వేలాది మంది విద్యార్థులకు, చెస్ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. కష్టపడి సాధన చేస్తే అసాధ్యం ఏదీ లేదని ఆమె ప్రయాణం చెబుతోంది.



## క్రీడా స్ఫూర్తికి చిరునామా

నేటి యువతకు అశ్విక గౌడ్ ఆదర్శంగా నిలుస్తోంది. మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాల ప్రభావం పెరుగుతున్న కాలంలో సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రపంచ రికార్డులు సాధించడం గొప్ప విషయమని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. చెస్ క్రీడ ద్వారా మేధస్సు, ఏకాగ్రత, నిర్ణయ సామర్థ్యం పెరుగుతాయని, అలాంటి క్రీడలో చిన్నారి సాధించిన విజయం మరెందరికో ప్రేరణగా నిలుస్తుందని పేర్కొంటున్నారు.

## భవిష్యత్తు ప్రపంచ ఛాంపియన్‌గా ఎదగాలని ఆకాంక్ష

ప్రపంచ రికార్డులతో ప్రారంభమైన అశ్విక గౌడ్ ప్రయాణం ఇక్కడితో ఆగిపోవడం లేదు. జాతీయ, అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్లలో భారతదేశానికి పతకాలు సాధించి, ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. "పువ్వు పుట్టగానే పరిమళించింది" అనే నానుడికి అశ్విక గౌడ్ సజీవ నిదర్శనం. చిన్న వయస్సులోనే ప్రపంచ రికార్డులు సాధించిన ఈ బాల మేధావి భవిష్యత్తులో భారత చెస్ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచే పేరు కావాలని రాష్ట్ర ప్రజలు, క్రీడాభిమానులు, గురువులు, కుటుంబ సభ్యులు ఆకాంక్షిస్తున్నారు.







# బహిరంగ ప్రదేశాలలో మద్యపానంపై నిషేధం కొనసాగింపు

**-అనుమతి లేని డ్రోన్లు, డిజె సౌండ్స్ పై సైతం నిషేధాజ్ఞలు-కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు**

**-రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్):**

సాధారణ పౌరులు ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్ లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సోమవారం ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నామన్నారు. మద్యం సేవించి వీధుల్లో, రోడ్లపైన అసభ్య పదజాలంతో మాట్లాడటం, అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమించిందని, మద్యం ప్రియుల ఆగడాలకు కళ్లెం వేయడం తోపాటు ప్రజల భద్రత, రక్షణ కోసం నిషేధాజ్ఞలపై నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు జూన్ 01, నుండి జూలై 01 వరకు కొనసాగుతాయన్నారు. పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాలం పరిమితి పొడిగించబడే అవకాశం సైతం ఉందని తెలిపారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) 223, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనలను అనుసరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా డీజే, డ్రోన్ లపై నిషేధాజ్ఞలను సైతం పొడగింపు ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు భారీ శబ్దంతో కూడిన డిజె సౌండ్స్ వినియోగం పై నిషేధాజ్ఞలు విధించామన్నారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ, ప్రదర్శనల కోసం డీజే సౌండ్లు వినియోగిస్తున్నారని, అయితే వివిధ కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ వినియోగం తప్పనిసరి అని అనిపిస్తే, సంబంధిత డివిజన్ ఏసిపి ల నుండి అనుమతి పొందాలని సూచించారు. ఏయే ప్రాంతాల్లో ఏ మేరకు ఏ స్థాయిలో మైక్ సెట్ లో వినియోగించాలో నిబంధనలు ఉన్నాయన్నారు. ఈ నిషేధాజ్ఞలు సైతం జూన్ 01 నుండి జూలై 01 వరకు కొనసాగుతాయన్నారు. పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాలం పరిమితి పొడిగించబడే అవకాశం సైతం ఉందని తెలిపారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) 223, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనలను అనుసరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల్ జోన్ల పరిధిలో రామగుండం పోలీస్ కమిషనరేట్ యాక్ట్ 2026 లోని సెక్షన్ 7(1), సెక్షన్ 22(ఏ) నుండి (ఎఫ్), సెక్షన్ 22(2) నుండి (ఏ)(బి), సెక్షన్ 22(3), సిటీ పోలీస్ యాక్ట్ 1348 నెంబర్ 9 ఫసలీ సెక్షన్ 30, పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం జూన్ 01, 2026 నుండి జూలై 01, 2026 వరకు అమలులో ఉంటుందన్నారు. ఈ సెక్షన్ ల ప్రకారం రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని తెలిపారు. అటువంటి కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీసు అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. బంద్ ల పేరిట వివిధ కారణాలు చూపుతూ, బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసివేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురి చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రత పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.

# ప్రజా సమస్యలు పట్టించుకోవటం లో ప్రజాప్రతినిధులు విఫలం

**-రహదారి నిర్మాణానికి అడ్డంకులు చోద్యం చూస్తున్న పాలకులు, ప్రజాప్రతినిధులు -సమస్య పరిష్కారం చేయకపోతే ఆందోళన కొనసాగిస్తాం...**

**-సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ దావుద్.**

**వాజేడు (నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్)జూన్ 1**



వాజేడు మండలం లో చేరుకూరు ధర్మవరం రహదారి నిర్మాణం చేపట్టకపోవటం తో గుంతలు ఏర్పడి, ఇరుకు రోడ్డు లో ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, రైతు లు వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ దావుద్ అన్నారు.సోమవారం చేరుకూరు -ధర్మవరం ఆర్ అండ్ బి రహదారి దిగ్బంధన కార్యక్రమం లో పాల్గొని వారు మాట్లాడుతూ 2021 లో గాఔజు నిధులలో 13 కోట్ల రూపాయలు ఆనాటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే 3 కిలో మీటర్ల రోడ్డు మాత్రమే ఆపివేశారని,రోడ్డు నిర్మాణం చేపట్టాలి అంటే 47,50,000 రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని లేని యడల నిర్మాణం చేపట్టేది లేదని ఆపివేశారని, ప్రస్తుతం అధికారం లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నష్టం పరిహారం ఇవ్వకుంట, అటవీ శాఖ అధికారులతో మాట్లాడకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు.రోడ్డు నిర్మాణం కోసం జిల్లా మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ లను కలిసి విన్నవించుకున్న ఏమాత్రం ఫలితం లేదని, సమస్య పరిష్కారం చేయకుంట కాలయాపన చేస్తున్నారని,ఇది సరైంది కాదని అన్నారు, ఈ మండలం లో ఉన్న కాంగ్రెస్ నాయకులు సర్పంచులు ఎందుకని రోడ్డు సమస్య పై ప్రభుత్వం దృష్టి కి తీసుకెళ్లాటం లేదని, అటవీ శాఖ చైర్మన్ ఈ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఉండికూడా, అటవీ శాఖ తో ఎందుకని మాట్లాడటం లేదని సమస్య పరిష్కారం కోసం ఎందుకు చొరవ చూపటం లేదని వారు మాట్లాడుతూ అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు మాట్లాడుతూ కేంద్ర గుట్టలలో 40కిలో మీటర్ల రోడ్డుకు అటవీశాఖ కి ఎంత నష్ట పరిహారం చెల్లించరో అటవీశాఖ వెల్లడించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధాని, అంబానీలకు ఒక న్యాయం, పేద ప్రజలకు ఒక న్యాయమా అన్నారు,10రోజుల నుండి ఆందోళన చేస్తున్న ఈ ప్రభుత్వం కు చీమకుట్టినట్లు కూడా లేదని, గ్రామపంచాయతి తీర్మానం చేయాలనీ సర్పంచ్ లకు వినతిపత్రం ఇచ్చిన ఫలితం లేదని, ఫారెస్ట్ అధికారులను జీల్లా ఉన్నత అధికారులను ఎందుకని ప్రశ్నించటం లేదని,సమస్య పరిష్కారం కోసం ఎందుకు ఆందోళన బాట పట్టటం లేదని, వాళ్లకు ఉన్న అధికారాలను ఎందుకు ఇపయోగించటం లేదని అన్నారు.సమస్య పరిష్కారం కు పునుకోకపోతే ఈ ప్రాంత బంద్ తో పాటు జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున రాస్తా రోకో కార్యక్రమం చేపడతామని, రోడ్డు సమస్యను వదిలి పెట్టె ప్రసక్తే లేదని అన్నారు.రోడ్డు సమస్య పరిష్కారం కోసం చేరుకూరు -ధర్మవరం రహదారిపై శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిని బలవంతగా పోలీసులు అరెస్ట్ చేయటం కార్యక్రమం ను విచ్ఛిన్నం చేయటం సరైంది కాదని, మా శాంతి యుత ఆందోళనను అడ్డుకోవటం ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని రఘుపతిరావు మాట్లాడుతూ అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు జెజ్జరి దామోదర్, బచ్చల క్రిష్ణబాబు, గౌరారపు చంద్రశేఖర్, గార సదక్రిన్, భోగట సత్యం, బలుసుపాటి నరేష్ కుర్సం ప్రవీణ్, పుల్లూరి యశోద, శాంతకుమారి, తదితరలు పాల్గొన్నారు.

# పరిగి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పండుగ....

## మరో 2,000 ఇందిరమ్మ ఇళ్ల ప్రకటించిన పరిగి ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డి

**పరిగి (నేషనలిస్ట్ వాయిస్, ప్రతినిధి) జూన్ 01**



పరిగి మండలం గడిసింగాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఐదు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ.. ఇప్పటికే పరిగి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించినట్లు తెలిపారు. అదనంగా మరో 2,000 ఇళ్లను త్వరలో మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొంటున్నారని చెప్పారు. పేద ప్రజలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అదేవిధంగా కొత్త రేషన్ కార్డులను కూడా అందజేస్తున్నామని తెలిపారు. ప్రతి లబ్ధిదారునికి నెలకు 6 కిలోల సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించే పథకం రేపటి నుంచి అమల్లోకి రానుందని వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పటికీ పేదలకు ఒక్క ఇల్లు కూడా నిర్మించి ఇవ్వలేదని ఎమ్మెల్యే విమర్శించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు,కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైకోర్టు ఆదేశాలను అమలు చేసి మాజీ సర్పంచుల బకాయిలు చెల్లించాలి - మాజీ సర్పంచ్ కె. రాజిరెడ్డి

**దోమ నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి జూన్ 1:**



గ్రామాల అభివృద్ధి కోసం ఖర్చు చేసిన నిధులకు సంబంధించిన బకాయిలను మాజీ సర్పంచులకు వాయిదాల వారీగా చెల్లించాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం వాటిని తక్షణమే అమలు చేసి సంబంధిత అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని దోమ మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు కె. రాజిరెడ్డి డిమాండ్ చేశారు.మాజీ సర్పంచులకు రావాల్సిన బకాయిల చెల్లింపుల కోసం రాష్ట్ర సర్పంచుల ఐకాస ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాస ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం దోమలో రాజిరెడ్డిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వసంత్ జాదవ్ ఆయనను బయటకు వెళ్లవద్దని కోరినట్లు తెలిపారు. గృహ నిర్బంధం అనంతరం రాజిరెడ్డి మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి కోసం స్వంత నిధులు ఖర్చు చేసిన అనేక మంది మాజీ సర్పంచులు ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వారి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే బకాయిల చెల్లింపుల ప్రక్రియ ప్రారంభించాలని కోరారు.2025లో హైకోర్టు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు బకాయిలను వాయిదాల పద్ధతిలో చెల్లించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ, వాటి అమలులో నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆయన విమర్శించారు. రాష్ట్రస్థాయి అధికారులు కోర్టు ఉత్తర్వుల ప్రతులను జిల్లా పంచాయతీ అధికారులకు పంపించి, గ్రామ పంచాయతీలకు వచ్చే నిధుల నుంచి పాత బకాయిలను ఏ విధంగా చెల్లించాలనే అంశంపై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయలేదని ఆరోపించారు. కోర్టు ఆదేశాలను గౌరవించి, మాజీ సర్పంచులకు రావాల్సిన బకాయిలను కనీసం విడతల వారీగా అయినా చెల్లించేలా ప్రభుత్వం, అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కె. రాజిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# టిబిజికేఎస్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన

**మందమర్రి, జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్):**

బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అక్రమ అరెస్టుకు నిరసనగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టిబిజికేఎస్) ఆధ్వర్యంలో సోమవారం ఏరియాలోని అన్ని గనులు, విభాగాలపై కార్మికులు నల్ల బ్యాడ్జిలు ధరించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిబిజికేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ మాట్లాడుతూ, సింగరేణి సంస్థకు, కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించినందుకే బాల్క సుమన్ పై అక్రమ కేసు బనాయించి, జైలుకు పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు లేకుండా గొంతు నొక్కేస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వెంటనే బాల్క సుమన్ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిబిజికేఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రైతుభీమా డబ్బుల వివాదం..

## కన్నతల్లిని హత్య చేసిన కుమారుడికి జీవిత ఖైదు

**రూ.5 వేల జరిమానా కూడా విధించిన జిల్లా న్యాయస్థానం**

**నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు, ప్రాసిక్యూషన్ బృందాన్ని అభినందించిన ఎస్పీ**

**మెదక్, జూన్ 1 (నేషనలిస్ట్ వాయిస్):**

రైతుభీమా డబ్బుల విషయంలో తలెత్తిన కుటుంబ వివాదం చివరకు కన్నతల్లి హత్యకు దారితీసిన ఘటనలో నిందితుడైన కుమారుడికి జిల్లా ప్రధాన న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. అలాగే రూ.5 వేల జరిమానా కూడా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ విషయాన్ని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు వెల్లడించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హవేళీఘనపూర్ మండలం తోగిట గ్రామానికి చెందిన పుష్ఠి నర్సమ్మ, లచ్చయ్య దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. నర్సమ్మ తల్లి పుష్ఠి బాలమణి మరణించగా, రెండో కుమారుడు కూడా అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో రైతుభీమా నిధుల పంపిణీ విషయంలో కుటుంబ సభ్యుల మధ్య తరచూ విభేదాలు చోటుచేసుకుంటుండేవి.
ఈ క్రమంలో 2023 ఆగస్టు నెలలో నర్సమ్మ కుమారుడు పుష్ఠి బాను ప్రసాద్ రైతుభీమా డబ్బుల విషయమై తల్లితో వాగ్వాదానికి దిగాడు. మాటామాటా పెరగడంతో ఆగ్రహానికి లోనైన అతడు కత్తితో తల్లిపై దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన నర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి హవేళీఘనపూర్ ఎస్ఐ ఆనంద్ గౌడ్ కేసు నమోదు చేశారు. అనంతరం మెదక్ రూరల్ సీఐ విజయ్ కుమార్, సీఐ రాజశేఖర్ రెడ్డి కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి కీలక ఆధారాలు సేకరించారు. దర్యాప్తు అనంతరం నిందితుడిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు.కేసు విచారణ సమయంలో ప్రస్తుత సీఐ జార్జ్ సాక్షులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ ప్రాసిక్యూషన్ తరఫున బలమైన వాదనలు వినిపించారు. కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు మరియు ఇతర ఆధారాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడు పుష్ఠి బాను ప్రసాద్‌పై అభియోగాలు రుజువయ్యాయని నిర్ధారించారు.
దీంతో నిందితుడికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ ఎండీ గౌస్‌తో పాటు ప్రాసిక్యూషన్ బృందాన్ని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.



# శ్రీ బంగారు మైసమ్మ తల్లి ఆలయంలో బహిరంగ వేళముల నిర్వహణ..

**దామరచర్ల నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి జూన్ 1**



మండల పరిధిలోని కల్లేపల్లి గ్రామంలో కొలువైనటువంటి గిరిజనుల ఆరాధ్య దైవం దేవత అయినటువంటి శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి దేవస్థానము నందు 01-07-2026 నుండి 30-06-2027 వరకు ఒక సంవత్సర కాలపరిమితికి 1). దున్నపోతులు సేకరించుక?ను హక్కు 2),కొబ్బరికాయలు అమ్ముకొను హక్కు 3) లడ్డు ప్రసాదము అమ్ముకొను హక్కు,4) తలనీలాలు సికరించుకొన్ను హక్కు,5), కొబ్బరిచిప్పలు సేకరించుకొను హక్కు మరియు 6)పూలదండలు,నిమ్మకాయలు అమ్ముకొను హక్కుల గురించి శుక్రవారం నాడు ఈ నెల 5వ తేదీన ఉదయం 10:00 ల నుండి దేవాలయము వద్ద బహిరంగ వేలములు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణ అధికారి గుజ్జుల కొండారెడ్డి తెలియజేశారు.

# కాంగ్రెస్‌లో కలకలం..ఉమ్మడి తూప్రాన్ మండలంలో
# అస్థిత్వం పట్టు కోల్పోతున్న కాంగ్రెస్

**ఫ్యాక్స్ చైర్మన్ బాలకృష్ణ రెడ్డి రాజీనామాతో తూప్రాన్ రాజకీయాలు వేడెక్కిన వేళ**

**తూముకుంట నర్సారెడ్డి లక్ష్యంగా తీవ్ర విమర్శలు..**

**మాజీ సర్పంచ్‌లు, డైరెక్టర్లు, నాయకుల మూకుమ్మడి రాజీనామాలు**

**గజ్వేల్ కాంగ్రెస్‌లో వర్గపోరు బహిర్గతమైందా..?**

**రైతుల సమస్యలపై ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన బాలకృష్ణ రెడ్డి**

తూప్రాన్, జూన్ 1 (నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి):

ఉమ్మడి తూప్రాన్ మండల కాంగ్రెస్ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. తూప్రాన్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (ఫ్యాక్స్) చైర్మన్ మెట్టు బాలకృష్ణ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు ఫ్యాక్స్ చైర్మన్ పదవికి రాజీనామా చేయడం స్థానిక రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆయన వెంట పలువురు మాజీ సర్పంచ్‌లు, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కూడా పార్టీకి రాజీనామా చేయడంతో గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు బహిర్గతమైనట్లు కనిపిస్తున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలకృష్ణ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం, గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రైతులకు, ప్రజలకు న్యాయం జరగని పార్టీలో కొనసాగడం తన ఆత్మగౌరవానికి విరుద్ధమని పేర్కొన్నారు.

**రైతుల సమస్యలపై మండిపాటు**

రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల పూర్తిగా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని బాలకృష్ణ రెడ్డి ఆరోపించారు. వరి సాగు విస్తీర్ణం, దిగుబడులపై పూర్తి సమా చారం ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న ప్పటికీ కొనుగోలు ప్రక్రియను సమర్థంగా నిర్వహించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కొను గోలు కేంద్రాల్లో సరిపడా లారీలు లేక పోవడం, ధాన్యం నిల్వలపై సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొను గోళ్లలో సిండికేట్ వ్యవస్థ నడుస్తోందని ఆరోపిస్తూ, లోడింగ్, అన్‌లోడింగ్, తరుగు పేరుతో రైతులను దోచుకుంటు న్నారని విమర్శిం చారు. రైతు చెమటను కొందరు మధ్యవర్తులు, అధికార యంత్రాంగం కలసి దోపిడీ చేస్తున్నా ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషిస్తోందని మండిపడ్డారు.

**నర్సారెడ్డి వైఖరిపైనే అసంతృప్తి**

గజ్వేల్ కాంగ్రెస్ ఇంచార్జి తూముకుంట నర్సారెడ్డి వ్యవహారశైలి వల్లే తాను రాజీనామా చేయాల్సి వచ్చిందని బాలకృష్ణ రెడ్డి స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల ప్రారం భోత్సవాలకు ఆహ్వానించినా హాజరు కాలేదని, అనంతరం సంబంధిత బాధ్యులకు సమాచారం ఇవ్వకుండా కేంద్రాలను సందర్శించి ఫోటోలకు మాత్రమే పరిమితమయ్యారని విమర్శిం చారు. నియోజక వర్గంలో కొందరిని ప్రోత్స హిస్తూ వర్గ రాజకీయాలకు తెరలేపారని, పార్టీని బలోపేతం చేయడం కంటే వ్యక్తిగత ఆధిపత్యాన్ని పెంచు కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పదవుల పంపిణీలో పారదర్శకత లేకుండా వ్యవహ రించారని, డబ్బుల ప్రాధాన్యత పెరిగిందనే ఆరోపణలు కూడా చేశారు.

**గ్యారెంటీల అమలుపై ప్రశ్నలు**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బాలకృష్ణ రెడ్డి ఆరోపించారు. రైతు భరోసా, ఎరువుల సరఫరా, వ్యవసాయ మద్దతు వంటి అంశాల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు కాగి తాలకే పరిమితమయ్యాయని అన్నారు. రైతుబంధు చెల్లింపుల్లో జాప్యం, యూరియా కొరత, కొను గోలు కేంద్రాల నిర్వహణలో వైఫల్యం వంటి అంశాలు రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నారని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి కనిపిం చడం లేదని విమర్శించారు.

**మాజీ సర్పంచ్ భగవాన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

నాగులపల్లి మాజీ సర్పంచ్ భగవాన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంపై తమకు ఎలాంటి అసంతృప్తి లేదని, కానీ స్థానిక నాయకత్వం వల్లే కార్యకర్తలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. రాష్ట్ర నాయకత్వంపై నమ్మకంతో పార్టీలో చేరిన తమలాంటి వారిని పట్టించుకోలేదని ఆరోపించారు. నియోజకవర్గ స్థాయిలో పదవుల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, పార్టీ సిద్ధాంతాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్‌లో కొనసాగడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్‌కు రాజకీయ నష్టం తప్పదా..?**

తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో సహకార సంఘాలు, గ్రామస్థాయి రాజకీయాల్లో ప్రభావం కలిగిన నాయకులు ఒకేసారి పార్టీని వీడటం కాంగ్రెస్‌కు రాజకీయంగా ఎదురు దెబ్బగా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ముఖ్యంగా రైతు సమస్యల నేపథ్యంలో వెలువడిన ఈ అసంతృప్తి భవిష్యత్తులో మరింత మంది నాయ...




ఫ్యాక్స్ చైర్మన్ పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మెట్టు బాలకృష్ణారెడ్డి

# ఫిల్టర్ బెడ్ లపై భద్రత వ్యవస్థను ఏర్పాటు చేయాలి

మందమర్రి, జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్):

సింగరేణి ఏరియాలోని కేకే 3 ఫిల్టర్ బెడ్, చేతులాపూర్ ఫిల్టర్ బెడ్ అటవీ ప్రాంతంలో ఉన్నందున దొంగల బెడద అధికంగా ఉందని, దొంగలు పంపు ఆపరేటర్ల పై రాళ్ల దాడి చేసి, కాపర్ ను దొంగలించకపోతున్నారని, ఫిల్టర్ బెడ్ లపై సింగరేణి యాజమాన్యం భద్రత వ్యవస్థను ఏర్పాటు చేసి, దొంగల బెడదను, వారి దాడులను నివారించాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో ఆయన సివిల్ విభాగాన్ని సందర్శించి, కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, సివిల్ విభాగం లో ఉన్నా ఖాళీలను భర్తీ చేయాలని స్ట్రక్చరల్ సమావేశంలో యాజమాన్యం దృష్టికి తీసుకుపోయామని గుర్తు చేశారు. సివిల్ అధికారులు, ఏరియా జిఎం, ఏరియా సెక్యూరిటీ అధికారి దృష్టికి దొంగల బెడద సమస్యను తీసుకువెళ్లి, సెక్యూరిటీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీమనాధుని సుదర్శన్, పిట్ కార్యదర్శులు కలవల శ్రీనివాస్, సిహెచ్ శర్మ, చెట్టి రాజేందర్, బండి సదానందం, గోవిందుల శ్రీనివాస్, వీరవేణి రాజయ్యలు పాల్గొన్నారు.



# తెలంగాణ రాజ్యాధికార పార్టీ సన్నాహక సమావేశం

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్):

జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలో సోమవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పటేల్ వనజ మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల రాజ్యాధికార స్థాపనే లక్ష్యంగా పార్టీ చీఫ్ మల్లన్న అడుగు ముందుకు వేశారని, ఆ అడుగుకు మన అడుగులను జోడిస్తూ, వందలాది వేలాది లక్షలాది అడుగులు తోడై, బహుజన రాజ్యాధికారం స్థాపించే అంతవరకు శ్రమిస్తూనే ఉండాలని పిలుపునిచ్చారు. జులై 5న భువనగిరిలో నిర్వహించే భారీ బహిరంగ సభకు జిల్లా నుండి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పార్టీ చీఫ్ మల్లన్న ఆశయాలు, తెలంగాణ రాజ్యాధికార పార్టీ విధి విధానాలు నచ్చి పార్టీలో చేరడానికి ముందుకు వచ్చిన పలువురికి ఆమె పార్టీ కండువా కప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# సిఎంఆర్ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్):

రైతు సంక్షేమంలో ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యం కేటా యించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని, రైస్ మిల్లుల నిర్వహకులు సిఎంఆర్ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసు కోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని హాజీపూర్ మండలంలోని ఎస్ఆర్ఎం రైస్ మిల్ ను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు తో, గాయత్రి రైస్ మిల్ ను మండల తహశీల్దార్ పుష్పలత తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లా డుతూ, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులు, గోదాములకు తర లించడం జరుగుతుందని తెలి పారు. రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యం సిఎంఆర్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. లక్షెట్టిపేట మండల కేంద్రంలోని శ్రీరామ రైస్ మిల్ ను మండల తహశీల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం దండేపల్లి మండలంలోని జై యోగేశ్వర రైస్ మిల్, దండేపల్లి, కొర్విచెల్మ లలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను మండల తహశీల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి పరిశీలించారు. కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా పారదర్శ కంగా, వేగంగా నిర్వ హించాలని తెలిపారు. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని గోదాములలో నిల్వ చేయాలని తెలిపారు. ధాన్యం నిల్వ, తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటిం చాలని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసు కోవాలని నిర్వాహకులకు సూచిం చారు. ప్రభుత్వం నిర్దేశిత సమయానికి అను గుణంగా ధాన్యం ప్రక్రియను వేగవంతం చేయాలని, లక్ష్యా లను త్వరగా పూర్తి చేసే విధంగా అధి కారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తాసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన బాల లక్ష్మి

చేగుంట జూన్ 1 ( నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్ )



చేగుంట మండల నూతన తహ సీల్దారుగా బాల లక్ష్మి సోమ వారం బాధ్యతలు చేపట్టారు ఇంతకు ముందు విధులు నిర్వహించిన తహసిల్దార్ శివప్రసాద్ బదిలీపై వెళ్లడంతో ఆమె నియ మితు లయ్యారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఎల్ల ప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు, భూ సమస్యలు ఉన్నవారు కార్యాలయానికి వచ్చి తమ సమస్యలు తెలియజేయాలని సూచించారు

# మహావీర్ ఆస్పత్రిలో విషాదం..

## వైద్యుల నిర్లక్ష్యంతో చిన్నారి మృతి తల్లిదండ్రుల ఆవేదన

**వికారాబాద్ జిల్లా నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి జూన్ 1:**



వికారాబాద్ పట్టణ కేంద్రంలో గల మహావీర్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న ఓ చిన్నారి మృతి చెందడంతో విషాదకర పరిస్థితులు నెలకొన్నాయి. తమ కుమార్తె మరణానికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ చిన్నారి తల్లిదండ్రులు ఆస్పత్రి ఎదుట కన్నీరుమున్నీరుగా విలపించారు. తల్లిదండ్రుల కథనం ప్రకారం, చిన్నారికి ప్రత్యక్షంగా వైద్యం అందించకుండా సెల్‌ఫోన్ ద్వారా సూచనలు ఇస్తూ చికిత్స నిర్వహించారని వారు ఆరోపించారు. ఈ నిర్లక్ష్య వైఖరి కారణంగానే తమ బిడ్డ ప్రాణాలు కోల్పోయిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి మృతదేహంతో ఆస్పత్రి వద్దకు చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆస్పత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, బాధిత కుటుంబ సభ్యులకు స్థానికులు, బంధువులు మద్దతుగా నిలిచారు. ఈ ఘటనకు సంబంధించి ఆస్పత్రి యాజమాన్యం లేదా వైద్యుల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఘటనపై పోలీసులు, సంబంధిత అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



# జూన్ 3న పరిగిలో కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏలకు శిక్షణ శిబిరం

## పరిగి ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డి

**పరిగి (నేషనలిస్ట్ వాయిస్, ప్రతినిధి) జూన్ 01**


కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సార్ కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నియమించిన ప్రత్యేక ట్రైనర్ల ద్వారా తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటి బిఎల్ ఏల శిక్షణ కార్యక్రమాన్ని జూన్ 3వ తేదిన బుధవారం పరిగిలోని ఎన్ కే. కన్వెన్షన్ హాల్ లో నిర్వహిస్తున్నట్లు పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో సార్ ప్రక్రియ, ఓటరు జాబితా సవరణలు, బిఎల్ఏల బాధ్యతలు, పార్టీ తరఫున చేపట్టాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పరిగి నియోజకవర్గంలోని 305 బూత్‌లకు చెందిన కాంగ్రెస్ పార్టీ బిఏల్‌ఏలు అందరూ తప్పనిసరిగా హాజరై ఈ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.




# ఎంపీ ఈటెల రాజేందర్ ని అపఖ్యాతికి గురి చేయడానికి ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

## బిజెపి నాయకులు ముకుంద నాగేశ్వర్

**పరిగి (నేషనలిస్ట్ వాయిస్, ప్రతినిధి) జూన్ 01**



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో తనవంతు కీలక పాత్ర పోషించిన ఉద్యమ నేతలలో ఒకరైన ఈటెల రాజేందర్ ని అపఖ్యాతి పాలు చేయడం అంటే మేలిమి బంగారానికి బురద అంటించడం లాంటిది ఎంత బురద అంటించిన మేలిమి బంగారం విలువ తగ్గదు కాబట్టి ఈటెల రాజేందర్ పై దుష్ప్రభావాన్ని తీవ్రంగా ఖండిస్తూ దుష్ప్రచారానికి బాధ్యులైన వారిపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నామని బిజెపి నాయకులు ముకుంద నాగేశ్వర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ నేతగా, ఎమ్మెల్యేగా, శాసనసభలో తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించిన ప్రతిపక్ష నేతగా, రాష్ట్ర సాధకునిగా, మంత్రిగా సేవలందించి ప్రస్తుతం ఎంపీగా ప్రజలకు సేవలు అందిస్తున్నటువంటి ఈటెల రాజేందర్ ని ఎదుగుదలను చూసి ఓర్వలేక తెలంగాణలో అతిపెద్ద బలమయినా బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతకు భవిష్యత్తులో అవకాశాలు అడ్డుకోవాలన్నా సంకుచిత భావంతో ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడడం సమంజసం కాదన్నారు. ఎవరు ఎటువంటి దుశ్చర్యలకు పాల్పడినా భవిష్యత్తు రాజకీయాల్లో ఉన్నత స్థితికి ఎదిగే విధంగా తెలంగాణ సమాజానికి సేవ చేసే విధంగా ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉన్న నాయకుడు ఈటల రాజేందర్ కావున ఇటువంటి దుశ్చర్యలకు ఎవరూ పాల్పడవద్దని దుష్ప్రచారానికి పాల్పడే వ్యక్తులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని బిజెపి నాయకులు ముకుంద నాగేశ్వర్ అన్నారు.

# తెలంగాణలో ప్రభుత్వ అద్దె వాహన యాజమాన్యుల ఆవేదన బిల్లుల పెండింగ్.!

-పెరుగుతున్న ఖర్చులు. పట్టించుకోని వ్యవస్థ.

-అధికారుల ప్రయాణం సాఫీ.! వాహన యాజమాన్యుల జీవితం కష్టాలమయం..!

-బిల్లులు రావు.! బ్యాంకులు వదలవు..!!

-అద్దె వాహనాల యాజమాన్యాలకు ఆర్థిక సంక్షోభం.!

-ప్రభుత్వ సేవలో వాహనాలు.! నష్టాల్లో యాజమాన్యాలు..!!

-చక్రాలు తిరుగుతున్నాయి.! యాజమాన్యుల బతుకులు నిలిచిపోతున్నాయి..!

-అధికారుల కార్లకు ఫుల్ ట్యాంక్.! యాజమాన్యుల జేబులు ఖాళీ..!

-అధికారుల కోసం పరుగులు.! యాజమానులపై అప్పుల కొరడా..!

-బకాయిల భారం.! అద్దె వాహనాల రంగం అస్తవ్యస్తం..!!

-నెలల తరబడి బిల్లుల బందీగా అద్దె వాహన యాజమాన్యాలు..!

-వాహనాలు ప్రభుత్వానికి.! వడ్డీలు యాజమాన్యాలకు..!!

-ప్రభుత్వానికి సేవలందిస్తే ఇదేనా ప్రతిఫలం.!?

-సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

క్యాబినెట్ లో చర్చించి సంవత్సరం గడుస్తున్న, అమలు మాత్రం సాధ్యం కావడం లేదు.!

-2017 సంవత్సరం నాటి బిల్లులే నేటికీ అమలు.

**ములుగు జిల్లా**

**(నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి) జూన్ 1**

తెలంగాణ రాష్ట్రంలో ఉదయం ఆరుగంటలకు వివిధ ప్రభుత్వ శాఖలు జిల్లా కలెక్టర్ నుంచి మండల స్థాయి అధికారుల వరకు, అలాగే వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లు, మిషన్ భగీరథ, విద్యుత్ సంస్థలు, రెవెన్యూ, ఆరోగ్య, పోలీస్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మైనింగ్, ఎక్సైజ్, తదితర శాఖల్లో వేలాది అద్దె వాహనాలను డ్రైవర్ సిద్ధం చేసి ఎదురుచూస్తూ సేవలంది స్తున్నారని, ప్రభుత్వ యంత్రాంగం గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర రాజధాని వరకు సమర్థవంతంగా పనిచే యడంలో ఈ వాహనాల పాత్ర కీలకం. అయితే ప్రభుత్వానికి నిరంతరం సేవలందిస్తున్న అద్దె వాహన యజమానులు నేడు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జగమెరిగిన సత్యం.

**నెలల తరబడి బిల్లులు పెండింగ్:**

అద్దె వాహన యజమానులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య బిల్లుల చెల్లింపుల్లో జాప్యం, కొన్ని శాఖల్లో మూడు నుంచి ఆరు నెలల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉండగా, మరికొన్ని చోట్ల ఏడాది వరకు బకాయిలు పేరుకుపోయినట్లు యజమానులు చెబుతున్నారు. వాహనం నడిపిన వెంటనే డీజిల్ బంక్ యజమాని డబ్బులు అడుగుతాడని, ఫైనాన్స్ సంస్థలు నెలసరి వాయిదాలు కోరుతాయని, బీమా, పన్నులు, మరమ్మతుల ఖర్చులు కూడా తప్పడం లేదని, కానీ ప్రభుత్వం నుంచి బిల్లులు సమయానికి రాకపోవడంతో యజమానులు అప్పుల పాలవుతున్నారని ఈ సందర్భంగా స్పష్టంగా కనిపిస్తోందని విశ్లేషకులు అంటున్నారు.

**పెరిగిన ఇంధన ధరలు.! పాత అద్దె రేట్లు..!!**

గత కొన్నేళ్లలో డీజిల్, పెట్రోల్ ధరలు భారీగా పెరిగాయని, వాహనాల విడిభాగాలు, టైర్లు, ఇంజిన్ ఆయిల్, బీమా ప్రీమియాలు కూడా గణనీయంగా పెరిగాయని, కానీ అనేక శాఖల్లో ఇప్పటికీ పాత 2017 సంవత్సరం నాటి అద్దె రేట్లే అమలవుతు ఉండడం విడ్డూరంగా ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో వాహన నిర్వహణ ఖర్చులు పెరిగినా అద్దె రేట్లలో మార్పులు లేకపోవడం వల్ల యజమానులకు లాభాలు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు అయితే నష్టాలను భరిస్తూ కేవలం ఒప్పందాలు చేసుకుందుకు మాత్రమే వాహనాలు నడుపుతున్న పరిస్థితి నెలకొంది.

**బ్యాంకుల రుణాల భారం:**

అనేక మంది యువకులు, మధ్యతరగతి కుటుంబాలు, బ్యాంకు రుణాలు తీసుకొని వాహనాలు కొనుగోలు చేసి, ప్రభుత్వానికి అద్దెకు ఇచ్చారు. బిల్లులు సకాలంలో రాక పోవడంతో ఈఎంఐలు చెల్లించలేక బ్యాంకుల ఒత్తిడిని తట్టుకోలేక పోతున్నారు. కొన్ని సందర్భాల్లో రుణ బకాయిల కారణంగా వాహనాలను స్వాధీనం చేసుకునే పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయని యజమానులు చెబుతున్నారు. ప్రభుత్వానికి సేవలంది స్తున్నప్పటికీ ఆర్థిక భద్రత లేకపోవడం వల్ల వారి ఆందోళనకు కారణమవుతోందని చెప్పవచ్చును.

**డ్రైవర్ల సంక్షేమం కూడా ప్రశ్నార్థకం:**

వాహన యజమానులతో పాటు డ్రైవర్లు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్దిష్ట పని గంటలు లేకుండా ఎక్కువ సమయం విధులు నిర్వహించాల్సి వస్తోందని, అనేక ప్రాంతాల్లో డ్రైవర్లకు కనీస వేతనాలు, బీమా, ఆరోగ్య భద్రత వంటి సదుపాయాలు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి, ప్రభుత్వ సేవల కోసం రాత్రింబవళ్లు పనిచేసే డ్రైవర్ల సంక్షేమంపై కూడా ప్రత్యేక దృష్టి అవసరముందని సంఘాలు కోరుతున్నాయి.

**టెండర్ విధానంలో మార్పులు అవసరం:**

ప్రస్తుతం అమలవుతున్న కొన్ని టెండర్ నిబంధనలు చిన్న వాహన యజమానులకు ఇబ్బందికరంగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద ఏజెన్సీలు మాత్రమే టెండర్లలో పాల్గొనే పరిస్థితి ఏర్పడుతుండటంతో, వ్యక్తిగత వాహన యజమానులు అవకాశాలు కోల్పో తున్నారని, చిన్న యజమానులకు కూడా సమాన అవకాశాలు కల్పించే విధంగా టెండర్ విధానంలో సంస్కరణలు తీసుకురావాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**తక్షణమే ప్రభుత్వం స్పందించాల్సిన సమయం ఇది:**

ప్రభుత్వ అద్దె వాహనాలపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరి సమస్యలు కేవలం ఒక వృత్తికి సంబంధించినవి మాత్రమే కాదు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, రవాణా రంగానికి కూడా ఇవి ముడిపడి ఉన్నాయని చెప్పవచ్చును.

1, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి.
2, ఇంధన ధరలకు అనుగుణంగా అద్దె రేట్లను సవరించాలి.
3, డ్రైవర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి.
4, బ్యాంకు రుణాల చెల్లింపులకు ప్రత్యేక సహాయ చర్యలు చేపట్టాలి.
5, టెండర్ విధానంలో పారదర్శకత పెంచాలి.
6, వాహన యజమానుల సంఘాలతో చర్చలు జరిపి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి.

**ముగింపు:**

ప్రభుత్వ యంత్రాంగం సజావుగా నడవడంలో అద్దె వాహనాల పాత్ర అత్యంత కీలకమైనదని, అధికారులను గమ్యస్థానాలకు చేర్చడం నుంచి అత్యవసర సేవల వరకు ఈ వాహనాలు ప్రభుత్వానికి వెన్నెముకలా నిలుస్తున్నాయని, అలాంటి పరిస్థితుల్లో అద్దె వాహన యజమానులు, డ్రైవర్లు ఆర్థిక కష్టాల్లో కూరుకుపోవడం ఆందోళన కర విషయం. వారి సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉంది. లేకపోతే ఈ రంగం సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని వాహన యజమానులు హెచ్చరిస్తున్నారు.

# దళితులు, గిరిజనుల భూముల జోలికి వస్తే సహించం...





-చిట్టెంపల్లి భూ వివాదంలో ఎమ్మెల్యే, పోలీసుల జోక్యంపై విచారణ జరపాలి...

-ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నిందితులను వెంటనే అరెస్టు చేయాలి -వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటయ్య

**పరిగి (నేషనలిస్ట్ వాయిస్, ప్రతినిధి)**

**జూన్ 01**

పరిగి నియోజకవర్గంలో దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులు, భూ ఆక్రమణ ప్రయత్నాలు, కుల వివక్ష, అధికార పార్టీ నాయకులు, కొందరు పోలీసు అధికారుల అండదండలతో పెరుగుతున్నాయని వ్యవ సాయ కార్మిక సంఘం, సీఐటీయూ, కెవిపిఎస్, ఎస్సీ-ఎస్టీ-బీసీ-మైనార్టీ హక్కుల పరిరక్షణ సంఘం, గిరిజన సంఘం నాయకులు ఆరోపించారు. ఈ ఘటనలపై వెంటనే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం పరిగిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటయ్య, సీఐటీయూ జిల్లా కోశాధికారి బుస్సా చంద్రయ్య, నాయకులు కొత్తూరు చంద్రయ్య మాట్లాడుతూ...దళితులు, గిరిజనులు చట్టబద్ధంగా కొనుగోలు చేసుకున్న భూములను కొందరు అగ్రకుల భూస్వాములు, రాజకీయ అండదండలతో ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వికారాబాద్‌కు చెందిన గిరిజన యువకుడు ఆంగోత్ గణేష్ పూడూరు మండలం అంగడి చిట్టెంపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 100లో భూమి కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్నారని తెలిపారు. అదే సర్వే నంబర్‌లో మరో బాధితుడు విజయరాజు కూడా భూమి సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తు న్నారని చెప్పారు. తేది 22-04-2026న చిట్టెంపల్లి గ్రామానికి చెందిన కలిమొద్దీన్, జమీర్, హబీబ్లు అక్రమంగా పొలంలోకి ప్రవేశించి గిరిజన యువకుడిని కులం పేరుతో దూషించి, పంటను ధ్వంసం చేసి, భూమి తమదేనంటూ బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. ఈ ఘటనపై బాధితుడు చన్‌గోముల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో నేషనల్ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారని, కమిషన్ ఆదేశాల మేరకు 01-05-2026న ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం కింద కేసు నమోదు అయ్యిందని తెలిపారు. అయితే కేసు నమోదైనప్పటి నుండి నిందితులను అరెస్టు చేయకుండా బాధితులనే రాజీకి ఒత్తిడి చేయడం, భూములను అమ్మాలని హెచ్చరించడం, సమస్య నుంచి తప్పు కోవాలని సూచించడం జరుగుతోందని ఆరోపించారు. చన్‌గోముల్ ఎస్సై భారత్ రెడ్డి అనేకసార్లు బాధితులు ఆంగోత్ గణేష్, విజయరాజులను పిలిపించి భూములు అమ్మేయాలని, లేకుంటే మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించి నట్లు బాధితులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో పరిగి ఎమ్మెల్యే శ్రీ రామ్మోహన్ రెడ్డి పాత్రపై కూడా బాధితులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారని నాయకులు తెలిపారు. కేసులో నిందితులకు మద్దతుగా వ్యవహరించడం, బాధిత గిరిజన యువకుడికి వ్యతిరేకంగా కేంద్ర మంత్రికి లేఖ రాయడం, స్థానిక పోలీసులపై ప్రభావం చూపుతున్నారనే ఆరోపణలు గిరిజన, దళిత వర్గాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ప్రజాప్రతినిధులు రాజ్యాంగ బద్ధ పదవుల్లో ఉండి బాధితులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత కలిగి ఉంటారని, కానీ నిందితుల పక్షాన జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు రావడం అత్యంత దుర దృష్ట కరమన్నారు. చిట్టెంపల్లి భూ వివాదంలో ఎమ్మెల్యే జోక్యం, పోలీసుల వ్యవహారశైలిపై జిల్లా యంత్రాంగం, ఉన్నత పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. దళితులు, గిరిజనుల భూముల విషయంలో రాజకీయ జోక్యం, పోలీసు ఒత్తిళ్లు సహించబోమని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం ప్రకారం కులం పేరుతో దూషించడం, భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించడం, బాధితులను బెదిరించడం, రాజీకి ఒత్తిడి చేయడం, కేసులను ప్రభావితం చేయడం వంటి చర్యలు శిక్షార్హమైన నేరాలని గుర్తు చేశారు. బాధితులకు రక్షణ కల్పించడం, నిందితులపై వేగంగా చర్యలు తీసుకోవడం పోలీసుల చట్టబద్ధ బాధ్యత అని పేర్కొన్నారు.

అదేవిధంగా పూడూరు గ్రామానికి చెందిన దళిత జర్నలిస్టు రమేష్ పై జరిగిన కులవివక్ష ఘటనలో సంబంధిత వ్యక్తులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

పరిగి ప్రాంతానికి చెందిన సాయిబన్న, నర్సింలులు సర్వే నంబర్ 214లో కొనుగోలు చేసిన స్థలాన్ని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అగ్రిమెంట్ పేరుతో ఆక్రమించేందుకు ప్రయత్ని స్తున్నారని, వారిపై కూడా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఐయినాపూర్ గ్రామానికి చెందిన రాములు తన ఇంటికి వెళ్లకుండా అడ్డుకున్న వ్యక్తిపై, దౌల్తాబాద్ మండలం గోకపస్లాద్ గ్రామానికి చెందిన దళిత మహిళ వెంకటమ్మ భూమి వివాదంలో వేధింపులకు పాల్పడిన వ్యక్తులపై కూడా ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులు, జీవన హక్కులు, సామాజిక న్యాయ సూత్రాలను కాలరాస్తూ దళితులు, గిరిజనులపై దాడులు, భూ ఆక్రమణలు కొనసాగితే ప్రజా సంఘాలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ, డీఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి అన్ని కేసుల్లో నిష్పక్షపాత విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, కెవిపిఎస్, గిరిజన సంఘం, దళిత సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కార్యాలయం ముట్టడి, ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం పరిగి డీఎస్పీ శ్రీనివాస్ కు వారు ఫిర్యాదు చేశారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ నాయకులు సత్యయ్య, గిరిజన సంఘం నాయకులు రమేష్, బాధితులు ఆంగోత్ గణేష్, విజయరాజు, రమేష్, సాయిబన్న, నర్సింలు, వెంకటమ్మ, హనుమయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న విద్యాలయాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు బీసీ సంఘం వినతి...





**నల్లగొండ నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి**

**జూన్ 1.**

మిర్యాలగూడ పట్టణంలో విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో పుట్టుకొస్తున్నాయని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్ ఆరోపించారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలో విద్యాశాఖ పర్మిషన్ లేకుండా పుట్టగొడుగుల రోజుకు ఒక ప్రైవేటు పాఠశాల పుట్టుకొస్తున్న విద్యాశాఖ అధికారులు నిద్రావస్థలో ఉండటం విషయంపై బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్ మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో విద్యాశాఖ పరిమిషన్ లేకుండా అనేక ప్రైవేటు పాఠశాలలు నడుస్తున్నప్పటికీ విద్యా శాఖ అధికారులు పట్టించుకోకుండా ప్రైవేటు పాఠశాలలకు వత్తాసు పలకడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ఎండాకాలం సెలవులు లలో కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా ప్రచారాలు చేస్తుంటే కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలలు డేస్కాలర్ విద్యార్థులకు సంవత్సరానికి లక్ష రూపాయలు వసూలు చేస్తుంటే విద్యాశాఖ అధికారులు నిద్ర మత్తులో ఉండటం సిగ్గుచేటు అన్నారు. తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారీ స్పందించి కార్పొరేట్ పాఠశాలల్లో అక్రమ ఫీజుల వసూలను అరికట్టాలని, విద్యాశాఖ పర్మిషన్ లేకుండా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు బైరం లక్ష్మీనారాయణ, బీసీ సంఘం నాయకులు ఆవుల రామన్న, సైదులు, రాజశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పసల సత్యనారాయణ మృతి పట్ల శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి సంతాపం

**పోలవరం, జూన్ 1 (నేషనలిస్ట్ వాయిస్):**

ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం యర్రంపేట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పసల శ్రీనివాస్ పితృవియోగం చెందారు. ఆయన తండ్రి పసల సత్యనారాయణ (సత్తిరాజు) ఆకస్మిక మరణం చెందడం పట్ల ఏపి స్పోర్ట్స్ అథారిటీ (శాప్) డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సత్యనారాయణ మరణం వారి కుటుంబానికి, పార్టీకి తీరని లోటని ఆమె పేర్కొన్నారు. మృతుడి నివాసానికి చేరుకున్న కొవ్వాసు జగదీశ్వరి.. సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. తమ కుటుంబం అన్ని వేళలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, పలువురు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



# గణేష్ నగర్‌లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

## - పోలవరం సీఐ కృష్ణ కుమార్, ఎస్సై పి. అప్పారావు

## - నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలి

## - గంజాయి, నాటు సారా విక్రయిస్తే కఠిన చర్యలు






**పోలవరం, జూన్ 1 (నేషనలిస్ట్ వాయిస్):**

జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు పోలవరం పరిధిలోని గణేష్ నగర్ నందు సోమవారం ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ కుమార్, ఎస్సై పులపా అప్పారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు సైబర్ నేరాలు, మహిళల భద్రత, రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల నిర్మూలన, అత్యవసర సేవలు మరియు సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ కుమార్ మాట్లాడుతూ.. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలను పాటించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని, ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు.

అలాగే ఈ సందర్భంగా ఎస్సై అప్పారావు మాట్లాడుతూ.. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. నాటు సారా, అక్రమ మద్యం సేవించడం వల్ల ఆరోగ్యపరంగానే కాకుండా, సామాజికంగా, చట్టపరంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎక్కడైనా మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అంతేకాకుండా సైబర్ మోసాలు, భద్రతపై అధికారులు ప్రజలకు పలు కీలక నంబర్లను సూచించారు: సైబర్ మోసాలకు గురైతే: వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలి. మహిళల భద్రత కోసం: 181 మహిళా హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలి. తక్షణ సహాయం కోసం 112 నంబర్‌కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలి. ఈ అవగాహన కార్యక్రమంలో గణేష్ నగర్ ప్రాంత ప్రజలు, మహిళలు, యువకులు మరియు స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోలీస్ శాఖ చేపట్టిన ఈ కార్యక్రమంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు ఎల్లప్పుడూ సహకరిస్తామని స్పష్టం చేశారు.

# నేరాలకు దూరంగా ఉండాలి.. సత్ప్రవర్తనతో జీవించాలి

## - రౌడీ షీటర్లకు హసన్‌పర్తి సీఐ కౌన్సిలింగ్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 01 నేషనలిస్ట్ వాయిస్ న్యూస్**

సమాజంలో శాంతిభద్రతల పరి రక్షణతో పాటు రౌడీ షీటర్లలో ప్రవర్తనా మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో హసన్‌పర్తి పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం అవ గాహన సమావేశం నిర్వ హించారు. సీఐ ఎ. మహేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 18 మంది రౌడీ షీటర్లు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడి నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పదేళ్లపాటు ఎలాంటి నేరాల్లో పాల్గొనకుం డా సత్ప్రవర్తన కనబరిస్తే రౌడీ షీట్ తొలగించే అవకా శం ఉంటుందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞా నంతో రౌడీ షీటర్ల కదలికలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నట్లు వివరించా రు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత జీవితం గడుపుతూ సమాజంలో మంచి గుర్తింపు పొందాలని సూచించారు. ప్రభుత్వ సంక్షే మ పథకాలను వినియోగిం చుకుని పిల్లల విద్యాభ్యాసా నికి తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. సమావేశాని కి హాజరైన రౌడీ షీటర్లు భవి ష్యత్తులో సత్ప్రవర్తనతో ఉంటామని, నేరాలకు దూరంగా జీవిస్తామని పోలీసులకు హామీ ఇచ్చారు.



# చెన్నుపాటి నారాయణరావు కుటుంబానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పరామర్శ

**నందిగామ, జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్):**

నందిగామ పట్టణంలోని రైతుపేట డౌన్ నివాసి దివంగత చెన్నుపాటి నారాయణరావు పెద్దకర్మ కార్యక్రమం సోమవారం నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబ సభ్యులను కలిసి వారిని పరామర్శించిన ఎమ్మెల్యే, తన తీవ్ర సానుభూతిని తెలియజేస్తూ వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పలువురు కూటమి నేతలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.





# ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతిని సత్వరమే పరిష్కరించాలి

## - ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యత - జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

## - ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్

## - 227 వినతులు స్వీకరణ

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

హనుమకొండ జిల్లా కలెక్ట రేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదన పు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, జడ్పీ సీఈవో శేషాద్రి, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీక రించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ రవి ప్రజలు వ్యక్తిగతంగా సమర్పించిన అర్జీలను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు పంపి స్తూ వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాల ని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకు వస్తున్నందున ప్రతి వినతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. ప్రజల ఫిర్యా దులు, వినతులు పెండింగ్ లో ఉండకుండా ఎప్పటి కప్పుడు సమీక్షిస్తూ సత్వర పరిష్కారం అందించాలన్నా రు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమై న సేవలు అందించడం ప్రతి అధికారి బాధ్యత అని పేర్కొ న్నారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపే దిశగా అధికారులు చిత్తశుద్ధి తో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి స్పష్టం చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో భూ సంబంధి త సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, రెవెన్యూ, పింఛన్లు, ఉపాధి, మౌలిక సదుపాయాలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 227 వినతులుజిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు ప్రజలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, సీపీఓ సత్య నారాయణరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# దివ్యాంగుల సంక్షేమం సామాజిక బాధ్యత

## - ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి జూన్ 1 (నేషనలిస్ట్ వాయిస్)**

దివ్యాంగుల యోగ క్షేమాలు చూడవలసిన బాధ్యత, సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక జనసేన కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు పి4కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బొలిశెట్టి ఈ సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం నుంచి పింఛన్లు మంజూరు అయ్యేవరకు అర్హులైన వారికి పి 4 కార్యక్రమంలో భాగంగా దాతల సహకారంతో ఈ పింఛన్లు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే సంకల్పించారు. గత నెలలో ఎమ్మెల్యే సొంత నిధులతో 45 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతినెలా పంపిణీ చేస్తామని ఇచ్చిన హామీలో ఈనెల పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సొంతంగా ఇచ్చిన 45 పింఛన్లతోపాటు మరికొందరు దాతలు ముందుకొచ్చి మరో 17 మందికి పింఛన్లు ఇస్తామని ప్రకటించారు. వచ్చే నెలలో మొత్తం 62మందికి పించన్లు ఇస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టాలలో ఉన్న వారిని ఆదుకోవడం మనిషి ధర్మంగా భావించి ఆర్థిక వెసులుబాటు ఉన్న ప్రతి ఒక్కరు పి 4 కార్యక్రమంలో భాగస్తులు కావాలన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటే భగవంతుని ఆశీస్సులు ఉంటాయన్నారు. పేదల సేవ కోసమే జనసేన పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. జనసేన అధ్యక్షులు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. జనసేన పై కులముద్ర వేయటం ఎవరికీ సాధ్యం కాదన్నారు. కులాలను, మతాలను కలిపే సిద్ధాంతమే జనసేన మూల సిద్ధాంతమని చెప్పారు..కుల, మతాలకు అతీతంగా యువత దేశాన్ని ప్రేమించాలని, ప్రజలకు సేవ చేయాలని పవన్ పిలుపునిచ్చారన్నారు. పి 4లో భాగంగా పింఛన్లు ఇవ్వటానికి ముందుకొచ్చిన కూటమి నాయకులు, వ్యాపార వేత్తలు, ప్రముఖులు, దాతలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు



తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు ఎమ్మార్వో సునీల్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి మల్లికార్జునరావు, ఎక్సేంజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి పంచాయతీ రాజ్ ఏఈ నరసింహవ యూర్తి, ఎక్సైజ్ ఎస్సై దొరబాబు, ఏడిఏ శ్రీనివాస్, సిఐ ఆది ప్రసాద్, రూరల్ సీఐ, రవికుమార్, వర్తనపల్లి కాశి, పుల్ల బాబి, పాలూరి వెంకటేశ్వరరావు, ఆకాశపు స్వామి, చాపల రమేష్, గొర్రెల శ్రీధర్, సిద్ధ వీర్రాజు, కట్టు బోయిన కృష్ణ ప్రసాద్, వాడపల్లి సుబ్బరాజు, దువ్వ శ్రీనివాస్, పైబోయిన వైదేహి, బేతినగిరి, ఎరుబండి సతీష్, పసుమర్తి రామ్ లక్ష్మణ్, బుడ్డి సాయిబాబా, కిలపర్తి వెంకటేశ్వరరావు, కేతిరెడ్డి రాంబాబు, పిల్లా రాంబాబు, శనగన రాంబాబు, మద్దిపాటి ధర్మేంద్ర,, మద్దిపాటి రవితేజ, గుంటుపల్లి రాంబాబు, వట్టికూటి అబ్బు, కాకర్ల సుభద్ర, పాలూరి భోపాల్, గుండుమోగుల, సురేష్, సూర్పని శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, బేదపూడి వెంకటరావు, గట్టం నాని, బండారు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ లబ్ధిదారుల ముఖాల్లో చిరునవ్వులు

# సామాజిక భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

- నందిగామ 6, 11 వార్డుల్లో పెన్షన్ల పంపిణీ చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య
- లబ్ధిదారులతో ఆత్మీయంగా ముచ్చటించి, యోగక్షేమాలు తెలుసుకున్న ఎమ్మెల్యే
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపిన వృద్ధులు, వికలాంగులు





**నందిగామ, జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్):**

పేదలు, వృద్ధులు, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు చేర వేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు. నందిగామ పట్టణం లోని 11వ మరియు 6వ వార్డులలో సోమవారం నిర్వహించిన సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె కూటమి నేతలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులకు నేరుగా పెన్షన్ నగదును అందజేసి, వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. "మీకు అందుతున్న ఈ పెన్షన్ నగదు ఏ విధంగా ఉపయోగపడుతోంది?" అని అడిగి వారి అభిప్రాయాలను, యోగక్షేమా లను తెలుసుకున్నారు.


అలాగే నెల మొదటి తేదీనే, అది కూడా ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ అందజేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానంపై వృద్ధులు, వికలాంగులు, ఇతర లబ్ధిదారులు పూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక భరోసా కల్పిస్తున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి కి, రాష్ట్ర ప్రభుత్వానికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ.. సామాజిక భద్రత పెన్షన్లు లబ్ధిదారుల జీవితాలకు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, భవిష్యత్తులోనూ అర్హులందరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, వార్డు నాయకులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారాలను తిప్పికొట్టిన శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి

**పోలవరం, జూన్ 1 (నేషనలిస్ట్ వాయిస్)**

డీఎస్సీ క్రీడల కోటా సర్టిఫికెట్లపై ప్రతిపక్షాలు చేస్తున్న విషపూరిత ప్రచారాలను ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి తీవ్రంగా ఖండించారు. ఎన్నో ఏళ్లుగా కష్టపడి క్రీడాకారులు సాధించుకున్న సర్టిఫికెట్లను 'ఫేక్' అని ముద్ర వేయడం వెనుక కూటమి ప్రభుత్వంపై బురదజల్లే కుట్ర దాగి ఉందని ఆమె మండిపడ్డారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ క్రీడాకారులకు సర్టిఫికెట్లను ఆయా క్రీడా అసోసియేషన్లు మాత్రమే జారీ చేస్తాయని, ఇందులో స్పోర్ట్స్ అథారిటీకి ఎలాంటి సంబంధం ఉండదని ఆమె స్పష్టం చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే, కూటమి ప్రభుత్వంపై కావాలనే దుష్ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే క్రీడల్లో రాణించిన అభ్యర్థులకు గుర్తింపునిస్తూ ప్రభుత్వం 3 శాతం రిజర్వేషన్ కల్పించిందని ఆమె గుర్తుచేశారు. డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న క్రీడా కోటా అభ్యర్థులు, యువత ఎలాంటి ఆందోళనలకు గురికావద్దని, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.గత ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో నిరుద్యోగులను పూర్తిగా వంచించారని జగదీశ్వరి విమర్శించారు.గత ఐదు సంవత్సరాలలో ఒక్క డీఎస్సీ పోస్టు కూడా భర్తీ చేయకుండా కేవలం 'ఆడుదాం ఆంధ్రా' లాంటి ఈవెంట్లతో కాలక్షేపం చేశారు. అలాంటి వారు ఇప్పుడు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తుంటే ఓర్వలేక విష ప్రచారాలకు తెరలేపారని కొవ్వాసు జగదీశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే మొదటి సంతకం 16,347 పోస్టుల మెగా డీఎస్సీ ఫైల్‌పైనే చేశారని ఆమె గుర్తుచేశారు. ఈ భారీ నోటిఫికేషన్‌లో ప్రత్యేకంగా 421 పోస్టులను క్రీడా కోటా కింద కేటాయించడం క్రీడాకారుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న గౌరవానికి నిదర్శనమన్నారు. రానున్న రోజుల్లో ప్రతిపక్షాల అబద్ధపు మాటలను ప్రజలు ఎవరూ నమ్మరని, నిరుద్యోగులకు, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జగదీశ్వరి స్పష్టం చేశారు.



# ఉపాధ్యాయుల నియామకంపై వైకాపా తప్పుడు ఆరోపణలు

## - మండల తెలుగు యువత అధ్యక్షులు

## కాల్నిడి వాసు ఘాటు విమర్శలు

**టీ. నర్సాపురం, జూన్ 01:(నేషనలిస్ట్ వాయిస్)**



కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 16 వేల మంది ఉపాధ్యాయుల నియామక ప్రక్రియపై వైకాపా నాయకులు చేస్తున్న ఆరోపణలను ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండల తెలుగు యువత అధ్యక్షులు కాల్నిడి వాసు తీవ్రంగా ఖండించారు. నిరుద్యోగుల జీవితాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపుతుంటే, ప్రతిపక్ష నేతలు ఓర్వలేక విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు.

సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులను కించపరిచి, వారిని మద్యం దుకాణాల వద్ద కాపలా కాయించిన దుర్మార్గపు చరిత్ర వారిదని ధ్వజమెత్తారు. నాడు ఉపాధ్యాయులను రోడ్డున పడేసి, నేడు మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల నియామకాలపై అబద్ధాలు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు.

అలాగే చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యంత పారదర్శకంగా జరిగిన ఈ నియామకాలతో కూటమి ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేకనే వైకాపా నేతలు కుట్ర రాజకీయాలు చేస్తున్నారని వాసు విమర్శించారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే, రాష్ట్ర యువత మరియు ఉపాధ్యాయుల చేతిలో వైకాపా నాయకులకు మరోసారి బుద్ధి చెప్పడం ఖాయమని ఆయన హెచ్చరించారు.

# సీపీ కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ వేళల మార్పు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషన రేట్ పరిధిలోని ప్రజల నుంచి సీపీ ఇకపై అన్ని పనిదినాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదులను స్వీకరించ నున్నారు. కమిషనర్‌ను ఆశ్రయించే లోపే బాధితులు ముందుగా కిందిస్థాయి అధి కారుల వద్ద ఫిర్యాదు చేసి ఉండాలని ఉన్నతాధికారు లు స్పష్టం చేశారు. ఈ నూతన విధానాన్ని ప్రజలు గమనించి, ఆయా సమయాల్లో కమిషనరేట్ కార్యాలయంలో సంప్రదించా లని అధికారులు ఒక ప్రకటనలో కోరారు.



# ప్రభుత్వ నిషేధిత గుట్కా అంబర్ ప్యాకెట్ల స్వాధీనం కేసు నమోదు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై ప్రత్యేక తనిఖీ లు నిర్వహిస్తున్న నేపథ్యం లో సోమవారం బాలసము ద్రం ప్రాంతంలోని ఏకశిలా పార్క్ వెనుక ఆకుల శ్రీని వాస్‌కు చెందిన కిరాణా దుకాణంలో సుబేదారి పోలీ సులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.. 23,000 విలువైన ప్రభుత్వ నిషేధిత అంబర్ ప్యాకెట్లు, గుట్కా ప్యాకెట్లు అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సంద ర్భంగా సుబేదారి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యానికి హాని కరమైన ప్రభుత్వంచే నిషేధించబడిన గుట్కా, అంబర్ వంటి పొగాకు ఉత్పత్తుల విక్రయాలు, నిల్వలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో సుబేదారి ఇన్స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్, ఎస్ఐ పాణి, కాని స్టేబుల్ సత్యనారాయణ పాల్గొన్నారు.



# బుట్టాయగూడెంలో ఘనంగా సామాజిక పెన్షన్ల పంపిణీ

## - లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం

బుట్టాయగూడెం:జూన్ 1(నేషనలిస్ట్ వాయిస్)

ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలంలో సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. మండలంలోని బుట్టాయగూడెం, లక్ష్మిదుగూడెం పంచాయితీల పరిధిలో ఉన్న బూసరాజుపల్లి, అంబేద్కర్ కాలనీ, బలరామమూర్తి వీధి, మరియు దేవుడి మన్యం ప్రాంతాలలో నివసిస్తున్న పెన్షన్ దారులకు నేరుగా పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు పంపిణీ చేస్తూ, ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయంపై వారి అభిప్రాయాలను, సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. సరైన సమయానికి చేతికి డబ్బులు అందడం పట్ల పెన్షనర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో పలువురు రాజకీయ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసిన వారిలో: గుట్ల ధర్మరాజు భారతీయ జనతా పార్టీ ఏలూరు జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి, పిల్లి అరవాల రాజు ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు, కొండేపాటి రామకృష్ణ ఏఎంసి వైస్ చైర్మన్పాల్గొన్నారు అలాగే ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ.. వృద్ధులు, వికలాంగులు, పీడిత వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సామాజిక పెన్షన్ల పంపిణీ నిరంతరాయంగా సాగుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ సచివాలయ సిబ్బంది చురుగ్గా పాల్గొన్నారు.





# విధి నిర్వహణ రాణిస్తే గుర్తింపుతో పాటు రివార్డులు వస్తాయి

## - వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్





ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

విధి నిర్వహణలో రాణించే సిబ్బంది శాఖపరమైన గుర్తింపుతో పాటు రివార్డులు వస్తాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సిబ్బంది సూచించారు. వరంగల్ కమిషనరేట్ కార్యాలయము లో పోలీస్ సిబ్బంది శాఖ పరమైన సమస్యలపై పోలీస్ అధికారులు ఏర్పాటు చేసిన దర్బార్ కార్యక్రమములో వరంగల్ పోలీస్ కమిషనర్ సిబ్బందితో సమావేశ మయ్యారు. ఈ సమావేశం లో ముందుగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నీజాయితీతో పనిచేయాలని, శిక్షణ సమ యంలో నేర్చుకున్నదే కోనసాగించాలని, ప్రభుత్వం అంటే ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసులని, పోలీసులు చేసే ప్రతి పని ప్రజలు గమనిస్తారని,ప్రస్తుత రోజుల్లో సోషల్ మీడియా ప్రభావం అధికంగా వుందని దీని కారణంగా పోలీసులు తప్పు చేసిన, చేయకున్న సోషల్ మీడియా ద్వారా పోలీసుల వ్యతిరేకంగా ప్రచారం జరుగుతుందని ఇది దృష్టిలో వుంచుకోని ప్రతి పోలీస్ అధికారి జాగ్రత్తగా పని చేయాలని నిరంతరం కష్టపడి విధులు నిర్వర్తించ డమే కాకుండా చేసే విధుల ను క్రమశిక్షణతో నిర్వహించా లని లేకుంటే ప్రజల్లో పోలీసుల పట్ల తప్పుడు సంకేతాలు పోతాయని మీకు ఎద్దైన శాఖ పరమైన లేక వ్యక్తిగత సమస్యలు వుంటే తన దృష్టి రావాలని, వీలైనంత వరకు పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని పోలీస్ కమిషనర్ తెలిపారు. అనంతం ఖైదీల ఎస్కాట్, ఇంక్రీమెంట్లు, విశ్రాంతి గదులుతో పాటు పలు శాఖ పరమైన సమస్యలు పోలీస్ సిబ్బంది పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుక వెళ్ళారు. ఈ సమావేశంలో అదనపు డిసిపిలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్,ఏసిపి నాగయ్య, అంతయ్య, సురేంద్ర, పరిపాలధికారి సంపత్ కుమార్ ఆర్.ఐలు సర్వర్థన్ రాజ్, సతీష్,శ్రీధర్, చంద్రశేకర్, సూపరింటెం డెంట్లు యాకుబ్ బాబా, సంధ్య, వహిద్ పాషా, గిరితో పాటు ఆర్.ఎస్.ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.

# అమ్మవారికి ఒడి బియ్యం నింపిన మహిళలు

దేవరకద్ర జూన్ 1 నేషనలిస్ట్ వాయిస్

దేవరకద్ర ఆర్యవైశ్య సంఘం మహిళలు జేష్ట అధికమాసం సందర్భంగా 33 అమ్మవార్లకు ఒడి బియ్యం నింపే కార్యక్రమం చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం హైదరాబాదులోని జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి, అలాగే ప్రత్యం గిరా దేవి అమ్మ వారు, అలాగే నిమిషాంబిక దేవి అమ్మవారు, అష్టలక్ష్మి టెంపుల్ లోని కొత్తపేటలో ఉన్న అమ్మవారికి ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు మంజుల రాణి ఆధ్వర్యంలో మహిళలు ఒడి బియ్యం నింపే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ ఘాతానికి ఒకరు మృతి

దేవరకద్ర జూన్ 1 నేషనలిస్ట్ వాయిస్



విద్యుత్ ఘాతానికి ఒక మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చౌదర్పల్లి గ్రామం వద్ద సోమవారం ఉదయం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల కథనం ప్రకారము సంఘటన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గురకొండ గ్రామానికి చెందిన నర్సింలు అనే వ్యక్తి మేస్త్రి పనులు చేస్తున్నాడు. ఎప్పటిలాగా సోమవారం చౌదరిపల్లి గ్రామం వద్ద ఒక ఇంటి దగ్గర నిర్మాణం పనులు చేస్తుండగా విద్యుత్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి భార్య శివమ్మ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ముగ్గరు కుమారులు ఉన్నారని గ్రామస్తులు తెలిపారు.

# 52,000 విలువ గల గుట్కా పట్టివేత

## - ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

టైలర్ స్ట్రీట్ లోని మహాదేవ్ జనరల్ స్టోర్ అనే కిరాణా స్టోర్ లో అక్రమంగా నిల్వ ఉంచిన నిషేధిత పొగాకు ఉత్పత్తులను పట్టుకున్నట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు నిందితుడు భూపేందర్ చౌదరి అట్టి నిషేధిత పొగాకు ఉత్పత్తులను ఇతర ప్రాంతాల నుండి తెప్పించి ఇక్కడ పలు షాపుల వారికి అమ్ముతున్నట్టు విచారణలో వెల్లడైంది అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు నమ్మదగిన సమాచారం మేరకు హన్మకొండ ఎస్సై కిషోర్, ఏఎస్ఐ లు సర్వేషం, రఘునరెడ్డి, కాన్స్టేబుల్ మోహన్ నాయక్ అట్టి కిరాణా షాప్ పై రైడ్ చెసి గుట్కాలు స్వాధీనపరుచు కున్నట్టు తెలిపారు.




# గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

దేవరకద్ర, జూన్ 1 నేషనలిస్ట్ వాయిస్

గుర్తు తెలియని వాహనం ఢీకొని కౌకుంట్ల మండలానికి చెందిన తూర్పు వెంకటన్న పెద్ద కుమారుడైన తూర్పు రామకృష్ణ దుర్మరణం పాలయ్యాడు. ఆదివారం సాయంత్రం తూర్పు రామకృష్ణ అప్పంపల్లి గ్రామం నుండి డీజిల్ తీసుకుని స్వగృహానికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్ళి పోయింది. తూర్పు రామకృష్ణ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. గ్రామంలో అందరితో కలిసి మెలిసి ఉండే వ్యక్తి చనిపోవడంతో గ్రామంలో విషా దాచార్యులు అలుముకున్నాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న దేవరకద్ర ఎస్సై నాగన్న కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# బాపట్ల మునిసిపల్ కమీషనర్ గా ఎం.చంద్రమోహన్ బాధ్యతల స్వీకరణ

బాపట్ల : జూన్ 1 (నేషనలిస్ట్ వాయిస్)



బాపట్ల మున్సిపాలిటీ నూతన కమీషనర్ గా ఎం.చంద్రమోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ అధికారులతో సమావేశమై పట్టణ అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారం మరియు మున్సిపల్ సేవల మెరుగుదలపై చర్చించారు.ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ.....బాపట్ల పట్టణ ప్రజలకు నాణ్యమైన మరియు వేగవంతమైన సేవలు అందించడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు.ముఖ్యంగా పారిశు ద్ధ్యం,తాగునీటి సరఫరా మరియు వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.పట్టణంలోని అన్ని వార్డులలో పరిశుభ్రతను మెరుగు పరచడంతో పాటు డ్రైనేజీల శుభ్రత,చెత్త సేకరణ వ్యవస్థను మరింత సమర్ధవంతంగా నిర్వహిస్తామని తెలిపారు.ప్రజలకు ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతామని,వీధి విద్యుత్ దీపాల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కారించేందుకు అధికారులు,సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తామని,ప్రజల సూచనలు మరియు ఫిర్యాదులకు ప్రధాన్యత ఇస్తామని కమీషనర్ తెలిపారు.ప్రజల సహకారంతో బాపట్ల పట్టణాన్ని పరిశుభ్రమైన మరియు అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# కుటుంబంలో చిచ్చు పెట్టిన ఫోన్ ట్యాపింగ్

## బిఆర్ఎస్ నిర్వాకంపై మండిపడ్డ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

హైదరాబాద్,జూన్1 (నేషనలిస్ట్ వాయిస్)

గత బిఆర్ఎస్ హయాంలో తన ఫోన్ మాత్రమే కాకుండా తన తల్లి, భార్య ఫోన్ నంబర్లను కూడా ట్యాప్ చేసినట్లు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆరోపించారు. సీఎల్పీ హాల్‌లో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.'మీ భర్తతో మాట్లాడే విషయాలను వేరే వాళ్లు వింటే మీకు ఎలా ఉంటుంది?' అంటూ ఆయన ప్రశ్నించారు. తన తల్లి పెద్ద రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి అని పేర్కొన్న ఆయన.. కుటుంబ సభ్యుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడం బాధాకరమని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తమ కుటుంబ జీవితంపై తీవ్ర ప్రభావం చూపిందని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తెలిపారు. 'ఇంటికి వెళ్తే మా భార్య నన్ను తిడుతోంది. నీ వల్ల నా ఫోన్ కూడా ట్యాప్ చేశారని నా భార్య అడిగితే ఏం చెప్పలేకపోతున్నా' అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

**కరీంనగర్ నేషనలిస్ట్ వాయిస్**

కరీంనగర్ పట్టణంలో మున్సిపల్ పర్మిషన్ లేకుండా అనేక భవనాలు హాస్పిటల్ భవనాలు నిర్మిస్తున్నారని పట్టణంలో కోర్టు పక్కన చందా న్యూరో & ట్రామాకేర్ హాస్పిటల్ ను పాత భవనం 45 సంవత్సరాల పైనపడిన భవనాన్ని రీ-మోడిలింగ్ చేసి అద్దాల మేడగా మార్చితే కూలిపోయే ప్రమాదం ఉంది కాబట్టి వెంటనే చర్య తీసుకోవాలి భవనానికి మున్సిపల్ పర్మిషన్ అనుమతి ఉన్నదా లేదా అనే దాని పై విచారణ జరపాలి. భవనానికి రీ-మోడలింగ్ చేసి పార్కింగ్ భాగాన్నిఎక్స్ రే స్కానింగ్ రూమ్ లలో పేషెంట్లకు ట్రీట్మెంట్ చేస్తూ పార్కింగ్ లేకుండా బయటనే హాస్పిటల్ కి వచ్చే వారి వాహనాలను రోడ్డుపైన పార్కింగ్ చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న చందా న్యూరో హాస్పిటల్ యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకొని ఇట్టి హాస్పటల్ ని సీజ్ చేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చంటి శ్రీనివాస్ ఈరోజు కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ గారికి వినతిపత్రం అందజేశారు అయన మాట్లాడుతూ గతంలో 23/08/2025 రోజున ఫిర్యాదు చేసిన తర్వాత షోకాజ్ నోటీస్ ఇవ్వడం జరిగిందిని చంటి శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వెంటనే పార్కింగ్ లేకుండా. పార్కింగ్ స్థలంలో రూపములను నిర్మించి ల్యాబ్. స్కానింగ్ రూమ్ లో చికిత్స నిర్వహిస్తున్నారని చందా న్యూరో అండ్ ట్రామాకేర్ హాస్పిటల్ ను వెంటనే కూల్చివేయాలని డిమాండ్ చేశారు. కోర్టు పక్కన ఉన్న హాస్పిటల్ ను వెంటనే కమిషనర్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేసి అట్టి హాస్పిటల్ ను వెంటనే కూల్చివేసి ఈ యజమానిపై చట్ట ప్రకారం చర్య తీసుకొని జైలుకు పంపాలని డిమాండ్ చేశారు




## ఉత్తరాఖండ్ లో జరిగే ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ సమావేశానికి కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ కు ఆహ్వానం

- ఈనెల 3, 4 తేదీలలో జరగనున్న సమావేశాలు..
- ఋషికేష్ నగరపాలక సంస్థ ఆహ్వానం మేరకు సమావేశాల్లో పాల్గొననున్న మేయర్ కోలగాని శ్రీనివాస్

**కరీంనగర్ నేషనలిస్ట్ వాయిస్**




ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగే ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117 వ సమావేశాల్లో గౌరవ అతిథిగా పాల్గొనాల్సిందిగా కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ కు ఋషికేష్ నగరపాలక సంస్థ ఆహ్వానం పలికింది. ఈ మేరకు సోమవారం రోజున ఋషికేష్ నగరపాలక సంస్థ నుండి మేయర్ కోలగాని శ్రీనివాస్ కు ఆహ్వాన పత్రికను పంపించారు. జూన్ 3, 4 తేదీల్లో ఋషికేశ్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ అధ్యక్షురాలు రేణు బాల గుప్తా అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశాలకు ముఖ్యఅతిథిగా ఉత్తరాఖండ్ ముఖ్య మంత్రి పుష్కర్ సింగ్ ధామి తో పాటు పలువురు క్యాబినెట్ మంత్రులు, రాజ్యసభ, లోక్ సభ సభ్యులు హాజరుకానున్నారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ కార్యదర్శి , ఆహ్వాన కర్త మనోజ్ గుప్తా, సహా ఆహ్వాన కర్త , ఋషి కేష్ నగరపాలక సంస్థ మేయర్ రణజాయ్ పాన్వర్ ల ఆహ్వానం మేరకు మేయర్ కోలగాని శ్రీనివాస్ సమావేశాల్లో పాల్గొననున్నారు. ప్రధానంగాఈ సమావేశాల్లో దేశంలోని వివిధ రాష్ట్రాల మేయర్లు పాల్గొని పట్టణాభివృద్ధి, నగర పాలన, ప్రజా సేవల మెరుగుదల, స్మార్ట్ సిటీ కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించనున్నారు.

# పింఛన్ల అర్హతలపై సమగ్ర విచారణ జరపాలి

## నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్

**పెద్దపల్లి జిల్లా: 01 జూన్ 2026 నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలో పింఛన్ల మంజూరు ప్రక్రియను పూర్తిస్థాయిలో సమీక్షించి, నిజమైన అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ముఖ్యంగా అంగవైకల్య పింఛన్లకు సంబంధించిన ధ్రువపత్రాలు, అర్హత ప్రమాణాలు, వైద్య ధృవీకరణ ప్రక్రియలను నిష్పాక్షికంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు ఆర్థికంగా వెనుకబడిన, నిజంగా సహాయం అవసరమైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మరియు ఇతర అర్హుల జీవనాధారంగా మారాయని పేర్కొంటున్నారు. అందువల్ల పింఛన్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా లేని కేసులను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.అర్హత కలిగిన పలువురు లబ్ధిదారులు ఇప్పటికీ పింఛన్ల కోసం ఎదురు చూస్తుండగా, ప్రతి దరఖాస్తును నిష్పాక్షికంగా పరిశీలించి అర్హులను గుర్తించడం అత్యంత అవసరమని అభిప్రాయపడుతున్నారు. అర్హతల నిర్ధారణలో పారదర్శకత ఉంటే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని చెబుతున్నారు. అలాగే ధ్రువపత్రాల జారీ, పరిశీలన, ఆమోద ప్రక్రియల్లో పూర్తి పారదర్శకత పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు క్రమానుగత తనిఖీలు నిర్వహించి పింఛన్ల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరుతున్నారు. సమగ్ర విచారణతో పాటు అర్హతల పునఃపరిశీలన చేపడితే నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాల లక్ష్యం సార్థకమవుతుందని లబ్ధిదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ధనం సరైన అర్హులకు చేరే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



# "బండి" కోసం మండు టెండలో "సైకిల్ బండి యాత్ర

- బండి సంజయ్ కు మంచి జరగాలని కోరుతూ పెరుగు వెంకటేశ్వర్లు జాతీయవాది సైకిల్ యాత్ర
- తిరుపతి నుండి హైదరాబాద్ దాకా 680 కి.మీల సైకిల్ యాత్ర
- హైదరాబాద్ లో బండి సంజయ్ నివాసానికి చేరుకున్న పెరుగు వెంకటేశ్వర్లు
- వెంకటేశ్వర్లుకు ఆతిథ్యమిచ్చి యాత్ర విశేషాలు తెలుసుకున్న కేంద్ర మంత్రి
- జాతీయ వాది బండి సంజయ్ ఈ దేశానికి అవసరమని చెప్పిన వెంకటేశ్వర్లు
- బండి సంజయ్ బాగుండాలని, కుట్రలను ఛేధించే శక్తిని ప్రసాదించాలని కోరుతూ సైకిల్ యాత్ర చేపట్టినట్లు వెల్లడి

**కరీంనగర్ బ్యూరో నేషనలిస్ట్ వాయిస్**






కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను రాజకీయంగా దెబ్బతీసేందుకు జరుగుతున్న కుట్రల నుండి కాపాడటంతోపాటు ఆయనకు మానసిక ప్రశాంతత కల్పించాలని కోరుతూ తిరుపతికి చెందిన 46 ఏళ్ల జాతీయ వాది పెరుగు వెంకటేశ్వర్లు "సైకిల్ యాత్ర" చేపట్టారు. తిరుపతి అలిపిరి వద్ద గంగమ్మకు మొక్కులు చెల్లించుకుని "శక్తి సంకల్ప యాత్ర" పేరుతో గత నెల 25న సైకిల్ యాత్ర ప్రారంభించారు. తిరుపతి మీదుగా మొదలైన సైకిల్ యాత్ర ఒంటిమిట్ట, కడప, నంద్యాల, మైదుకూరు, కర్నూలు మీదుగా తెలంగాణలో అడుగుపెట్టారు. అలంపూర్ మీదుగా పెబ్బేరు, జడ్చర్ల, బాలానగర్, షాద్ నగర్, శంషాబాద్ మీదుగా హైదరాబాద్ చేరుకున్నారు. ప్రతిరోజు సగటున 85 కి.మీల చొప్పున సైకిల్ తొక్కుకుంటూ ఈరోజు హైదరాబాద్ కు చేరుకున్నారు. వాస్తవానికి తిరుపతి నుండి కరీంనగర్ వరకు "శక్తి సంకల్ప యాత్ర" చేపట్టిన పెరుగు వెంకటేశ్వర్లు... బండి సంజయ్ కుమార్ హైదరాబాద్ లోనే ఉన్నారని సమాచారం రావడంతో నేరుగా బంజారాహిల్స్ లోని కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసానికి చేరుకున్నారు. పెరుగు వెంకటేశ్వర్లు సైకిల్ యాత్ర గురించి బీజేపీ కార్యకర్తల నుండి సమాచారం అందుకున్న బండి సంజయ్ పెరుగు వెంకటేశ్వర్లును తన నివాసానికి సాదరంగా ఆహ్వానించారు. తాను జాతీయ వాదినని, జాతీయ వాదులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉండాలనే సంకల్పంతో ఈ యాత్ర చేపట్టానని ఈ సందర్భంగా పెరుగు వెంకటేశ్వర్లు సంజయ్ కు తెలిపారు. మండుటెండను లెక్క చేయకుండా జాతీయ వాదులకు అండగా నిలుస్తూ పెరుగు వెంకటేశ్వర్లు చేస్తున్న "శక్తి సంకల్ప యాత్ర" అభినందనీయమన్నారు. అనంతరం పెరుగు వెంకటేశ్వర్లును శాలువాతో సన్మానించడంతోపాటు భోజన ఆతిథ్యమిచ్చారు. ఈ సందర్భంగా పెరుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశం కోసం, ధర్మం కోసం, హిందుత్వం కోసం జాతీయవాది బండి సంజయ్ చేస్తున్న పోరాటాన్ని చూసి ఆయన అభిమానిగా మారానన్నారు. ఇటీవల కాలంలో బండి సంజయ్ పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని చూసి తీవ్ర కలత చెందానని వాపోయారు. బండి సంజయ్ లాంటి జాతీయ వాది ఈ దేశానికి ఎంతో అవసరమని, అందుకే బండి సంజయ్ బాగుండాలని ఆయనకు జాతీయ వాదులంతా అండగా నిలవాలని కోరుతూ "శక్తి సంకల్ప యాత్ర" పేరుతో తిరుపతి నుండి హైదరాబాద్ వరకు సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. సైకిల్ యాత్రలో భాగంగా ప్రతిరోజు రాత్రి దేవాలయంలో బస చేసేవాడనని, మరుసటి రోజు ఆలయంలో బండి సంజయ్ బాగుండాలని పూజ చేసిన అనంతరం సైకిల్ యాత్ర చేసేవాడనని చెప్పుకొచ్చారు.

# కాచాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహణ





**శంకరపట్నం జూన్ 1 ( నేషనలిస్ట్ వాయిస్) :**

శంకరపట్నం మండలంలోని కాచాపూర్ గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన గృహాలను గ్రామ సర్పంచ్ ఊకంటి మాధవి మధుకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు దాసరి రజితరవీందర్, శనిగరపు అనితశ్రీనివాస్ దంపతుల నూతన గృహాలలో గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించగా, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఊకంటి మాధవి మధుకర్ మాట్లాడుతూ, నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కొత్త ఇంటిలోకి ప్రవేశించిన కుటుంబాలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. గృహప్రవేశం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన గృహ యజమానులను సన్మానించారు.

## నియోజకవర్గ వ్యాప్తంగా రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

**నేషనలిస్ట్ వాయిస్చండూరు మండలం జూన్ 1**

మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 59 వ జన్మదిన వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.







## ప్రజల నుంచి స్వీకరించిన ఆర్జీలను ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**నేషనలిస్ట్ వాయిస్ వనపర్తి జిల్లా ప్రతినిధి**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి అబ్రహం లింకన్ సూచించారు. సోమవారం వనపర్తి ఆర్డిఓ కార్యాలయంలో డివిజనల్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి అబ్రహం లింకన్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌలభ్యం, అర్జీల సత్వర పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి నిర్వహణకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. నేడు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 5 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# పింఛన్లు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదే

## - తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి)







**తాడేపల్లిగూడెం ప్రతినిధి జూన్ 1 (నేషనలిస్ట్ వాయిస్)**

రాష్ట్రంలో పింఛన్లు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం మండలంలోని మాధవరం, అప్పారావుపేట, వెంకట్రావుపాలెం గ్రామాల్లో అర్హులైన పలువురు లబ్ధిదారులకు ఆయన సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వలవల మల్లికార్జునరావు (బాబ్జి) మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా కూటమి ప్రభుత్వం రూ4 వేలు పెన్షన్ అందజేస్తుందని తెలిపారు. సుమారు 20 రాష్ట్రాల్లో రూ 500 నుంచి రూ వెయ్యి మధ్యనే ఇస్తున్నారని, తెలంగాణ, హర్యానా రాష్ట్రాల్లో మాత్రం రూ 2 వేలు అందజేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 35 రూపాయలతో పింఛన్ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారక రామా రావు శ్రీకారం చుట్టారని, అది దపదపాలుగా రూ 3 వేలుకు చేరిందన్నారు. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు పెన్షన్ను రూ 4 వేలకు పెంచడంతోపాటు అంతకు ముందు మూడు నెలల పెన్షన్ సొమ్ములు కూడా కలిపి ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. పేద ప్రజల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇదే నిదర్శనమని చెప్పారు. వృద్ధాప్యంలో ఉన్న వారు మందులను కొనుగోలు చేసుకునేందుకు ఈ పెన్షన్ సొమ్ములు కాస్త ఊరటనిస్తాయని చెప్పారు. వికలాంగులకు రూ3 వేల నుంచి రూ 6 వేలు, కిడ్నీ బాధితులకు రూ10 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ 15 వేలు చొప్పున కూటమి ప్రభుత్వం పెన్షన్ ఇస్తుందని తెలిపారు. లబ్ధిదారులు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకూడదనే ఉద్దేశంతో ప్రతినెల 1వ తేదీనే పెన్షన్ సొమ్ములు అందజేస్తున్నామని, ఒకటో తేదీ సెలవు వస్తే దాని ముందు రోజే పెన్షన్లు అందజేస్తున్నామని తెలిపారు. అర్హులైన రబ్ధిదారులకు నేరుగా పెన్షన్లు అందజేయడంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం ప్రజల సమస్యలను తెలుసుకుంటు న్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పరిమి రవికుమార్, ముత్యాల సత్యనారాయణ, శనగన శ్రీనివాస్ గౌడ్, కొండపల్లి దొరబాబు, కవులూరి పరిమళ, సూరిశెట్టి గణపతి, మాదాసు సతీష్, మాదాసు అశోక్ కుమార్, ముప్పిడి రమేష్, వెలిగట్ల రాము తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

## - భద్రకాళి చెరువులోకి మురుగునీరు చేరకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి

## - ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

## - ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

భద్రకాళి చెరువు అభివృద్ధి, పూడికతీత పనులు,ఆలయ మాడవీధుల నిర్మాణ పనుల ను మరింత వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భద్రకాళి చెరువు లోకి ఎట్టి పరిస్థితు ల్లోనూ మురుగునీరు చేర కుండా పటిష్ట చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

సోమవారం హనుమకొండ లోని కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ (కుడా) కార్యాలయంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామి రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదలతో కలసి వివిధ శాఖల అధికారులు, సంబం ధిత ఏజెన్సీల ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే భద్రకాళి చెరువుకు గేట్ల ఏర్పాటు, చెరువు పూడికతీత, ఆలయ మాడవీధుల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, భద్రకాళి చెరువుకు అవసరమైన గేట్ల ను వారం రోజుల్లోగా తెప్పించి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచు కొని భద్రకాళి చెరువులోకి మురుగునీరు చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే కాపువాడ ప్రాంత ప్రజలకు వరద ముప్పు తలెత్తకుండా ముందస్తుగా తగిన రక్షణ చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళి ఆలయ మాడవీధుల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి భక్తులకు త్వరితగతిన అందుబాటు లోకి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భం గా హనుమకొండ జిల్లా



కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, ప్రాధాన్యత కలిగిన పనులను గుర్తించి అధికారులు సమన్వయంతో వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా భద్రకాళి ఆలయ మాడ వీధులకు సంబంధించిన స్టోన్ వర్క్ పనులను వేగ వంతం చేయాలని సంబంధి త అధికారులకు సూచించా రు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడు తూ, వరంగల్ రైల్వే గేట్ వైపు ఉన్న ఇరుకు మార్గం ద్వారా వరద నీరు భద్రకాళి చెరువులోకి ప్రవహించే అవకాశం ఉందని తెలిపారు. ఆ మార్గాన్ని విస్తరించడం ద్వారా వరద నీటి ప్రవాహానికి అనుకూల పరిస్థితులు కల్పించవచ్చని సూచించారు. సమావేశంలో సాగునీటి పారుదల శాఖ అధికారులు ఎస్ఈ రాం ప్రసాద్, ఈఈ కిరణ్‌కుమార్, డీఈ మధుసూదన్‌రెడ్డి, కుడా సీపీఓ అజిత్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకే 'శక్తి యాప్' ప్రాధాన్యత ఎస్ఐ క్రాంతి కుమార్

## - జీలుగుమిల్లిలో మహిళల భద్రత, పోక్సో చట్టాలపై ప్రత్యేక అవగాహన సదస్సు

**జీలుగుమిల్లి, జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి):**

మహిళల భద్రత, బాలల రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'శక్తి యాప్'పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జీలుగుమిల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) క్రాంతి కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం జీలుగుమిల్లి గ్రామంలో మహిళల భద్రత, బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టాలపై (పోక్సో) ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ క్రాంతి కుమార్ స్థానిక ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యవసర పరిస్థితుల్లో ఉన్న మహిళలు, బాలికలు 'శక్తి యాప్' ద్వారా కేవలం ఒక్క క్లిక్‌తో పోలీసుల సహాయాన్ని వేగంగా పొందవచ్చని వివరించారు. ప్రతి మహిళ, యువతి తమ రక్షణ కోసం ఈ యాప్‌ను మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, తప్పనిసరిగా వినియోగించు కోవాలని సూచించారు. బాలలపై జరిగే అఘాయిత్యాలు, నేరాల నివా రణకు అమల్లో ఉన్న కఠిన చట్టాల గురించి ఆయన ప్రజలకు వివరిం చారు. అలాగే గ్రామాల్లో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, మహిళలు లేదా బాలలపై వేధింపులకు పాల్పడినా వెనుకాడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతాం అని సబ్



ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్ తెలిపారు. ఈ అవగాహన సదస్సులో స్థానిక మహిళలు, యువత, స్వయం సహాయక సంఘాల సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోర్టు వాయిదాలకు గైర్హాజరు

## - ఇద్దరు నిందితులు అరెస్ట్

## - జైలుకు తరలించిన హసన్‌పర్తి పోలీసులు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 01 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

న్యాయస్థానం ఆదేశాలను పట్టించుకోకుండా వాయిదా లకు హాజరుకాని ఇద్దరు నిందితులను హసన్‌పర్తి పోలీసులు అదుపులోకి తీసుకుని జైలుకు తరలించా రు. ఈ విషయాన్ని హసన్ పర్తి సీఐ మహేందర్ తెలిపారు. గతంలో నమోదైన పలు కేసులకు సంబంధించి న్యాయస్థానం లో వాయిదాలు ఉన్నప్పటికీ, నిందితులు నిర్ణీత తేదీల్లో హాజరు కాకపోవడంతో న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. హసన్‌పర్తి గ్రామానికి చెందిన నేతని కిరణ్ కుమార్, రేణికుంట్ల శివకుమార్ వాయిదాలకు గైర్హాజరు కావడంతో వారిపై అరెస్టు వారెంట్లు జారీ చేసింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు హసన్‌పర్తి పోలీసులు ఇద్దరినీ అదుపు లోకి తీసుకుని హుజూరా బాద్ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్ మాట్లాడుతూ, వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్నవారు తమకు కేటాయించిన వాయిదా తేదీల్లో తప్పనిసరిగా, నిర్ణీత సమయానికి న్యాయస్థానం ఎదుట హాజరుకావాలని సూచించారు. న్యాయస్థానం ఆదేశాలను నిర్లక్ష్యం చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఇలా ఉంటే వెళ్ళేది ఎలాగా?

**దేవరకద్ర జూన్ 1 నేషనలిస్ట్ వాయిస్**



దేవరకద్ర మున్సిపల్ కేంద్రంలో స్థానిక అంబేద్కర్ నగర్ కాలనీలో రైల్వే అండర్ బ్రిడ్జి నీటి నిల్వ ఎక్కువ ఉండడంతో రాకపోక లకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు అంటున్నారు. ఈ అండర్ బ్రిడ్జికి సమీపంలో ఉన్న కురువ గేది వాటర్



రావడం వల్ల అండర్ బ్రిడ్జి కిందికి వస్తున్నాయని అందుకుగాను వాహనాల రాకపోక లకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ప్రజా ప్రతినిధులు శ్రద్ధ తీసుకొని అండర్ బ్రిడ్జి కింద నీళ్లు ఉండకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# విద్యుత్ షాక్‌తో కూలీ కార్మికుడు మృతి

**దేవరకద్ర జూన్ 1 నేషనలిస్ట్ వాయిస్**

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన దేవరకద్ర మండల పరిధిలోని చౌదర్పల్లి గ్రామంలో చోటుచేసుకున్నట్లు దేవరకద్ర ఎస్సై నాగన్న తెలిపారు. పోలీసుల కథనం మేరకు... దేవరకద్ర మండల పరిధిలోని గురకొండ గ్రామానికి చెందిన కన్యమోని నర్సింలు (45) ఉపాధి నిమిత్తం దేవరకద్రలో నివాసం ఉంటూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే వ్యక్తి నిర్మిస్తున్న నూతన ఇంటి నిర్మాణ పనుల కోసం నర్సింలు వెళ్లాడు. పనులు నిర్వహిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఇనుప స్టూల్ కింద ఉన్న వైరు నుండి విద్యుత్ సరఫరా కావడంతో నర్సింలు తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నాగన్న వెల్లడించారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నట్లు తెలుస్తోంది..



# డీజిల్ తీసుకుని వస్తుండగా విషాదం..

## - రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి..

**దేవరకద్ర జూన్ 1 నేషనలిస్ట్ వాయిస్**



డీజిల్ తీసుకొని వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని కౌకుంట్ల మండలానికి చెందిన యువకుడు దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ నాగన్న కథనం మేరకు... కౌకుంట్లకు చెందిన తూర్పు వెంకటన్న పెద్ద కుమారుడు తూర్పు రామకృష్ణ (29) అప్పంపల్లి గ్రామం నుండి డీజిల్ తీసుకుని స్వగృహానికి తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి పరారైంది. ఈ ప్రమాదంలో రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామంలో అందరితో సత్సంబంధాలు కలిగి ఉండే రామకృష్ణ ఆకస్మిక మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాద సమాచారం అందుకున్న దేవరకద్ర ఎస్సై నాగన్న సంఘటన స్థలానికి చేరుకుని పూర్తి వివరాలు సేకరించి, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656